తీన్మార్
నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలుబడతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టలు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

teenmaardesk@gmail.com

for e-paper scan now

ములుగు | సంపుటి : 02 | సంచిక : 263 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 2 జనవరి 2024 | పేజీలు : 08 | వెల ౹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## న్యూఇయర్ మద్యం అమ్మకాల జోరు

మూడు రోజుల్లో రూ.658 కోట్ల మద్యం అమ్మకాలు

ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చిన కొత్త ఏడాది వేడుకలు



2 లో..

## గవర్నర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన సీఎం రేవంత్ రెడ్డి



2 లో..

## హైదరాబాద్ లో అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు


నగరంలో ఒక్కరోజే 3500లకు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



2 లో..

## నూతన సంవత్సరం దేశానికి ఎంతో ముఖ్యమైనది

కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



2 లో..

## పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ విజయవంతంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం



## వీఆర్ఏల సమస్యలను పరిష్కారానికి సీఎంని కోరిన రెవెన్యూ సంఘాలు

### సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డిని రెవెన్యూ సంఘాలు కోరాయి. సోమవారం సచివాలయంలో ఆయన్ని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి

మిగతా 2 లో

కాంట్రాక్టు ఉద్యోగులు సమర్పించిన పీహెచ్డీలు

## అసలా నకిలీవా..?

### దర్యాప్తు చేయాలని సెంట్రల్ క్రైంని ఉన్నత విద్యాశాఖ కోరినట్లు సమాచారం

తెలంగాణ బ్యూరో, జనవరి 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో క్రమబద్ధీకరణ కోసం కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు సమర్పించిన పీహెచ్డీ డిగ్రీలు అసలా నకిలీవా అన్న కోణంలో దర్యాప్తు చేసి ధ్రువీకరించాలని ఉన్నత విద్యాశాఖ సెంట్రల్ క్రైం స్టేషన్ ఉన్నతాధికారులను కోరినట్లు తెలిసింది. సుమారు రెండు నెలల క్రితం వివరాలన్నిటినీ పోలీసులకు అందజేసి విచారణ చేయాలని కోరినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఉద్యోగులు మధ్యప్రదేశ్లోని ఛతర్పుర్ బిహార్లోని దర్భంగ ఝార్ఖండ్లోని రామ్ఘర్.. ఇలా పదికిపైగా రాష్ట్రాల్లోని 40కి పైగా ప్రైవేటు విశ్వవిద్యాలయాల నుంచి




మిగతా 2 లో



## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.2.9కోట్ల బంగారం పట్టివేత

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): శంషాబాద్‌లోని రాజీవ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. విమానాల్లో దుబాయి నుంచి వ్యక్తిన నలుగురి నుంచి ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు మహిళల వద్ద 1865.2 గ్రాముల బంగారాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బంగారం రూ.1.18కోట్ల విలువ ఉంటుందని పేర్కొన్నారు. 16 బంగారు బిస్కెట్లను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో వ్యక్తి నుంచి 1,100 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ చెప్పింది. ఈ బంగారం విలువ రూ.69.85లక్షలు ఉంటుందని చెప్పింది. ఈ నెల 30న మహిళ నుంచి 1,632 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని దాని విలువ రూ.1.03కోట్ల ఉంటుందని కస్టమ్స్ వివరించింది.



2లో..

## నాస్తికుడు బైరి నరేష్ పై అయ్యప్ప స్వాముల అడ్డుకునే యత్నం

వెంటనే అరెస్ట్ చేయాలని స్వాముల డిమాండ్

## నల్లగొండ నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చందనా దీప్తి



నల్లగొండ, జనవరి 01 (తీన్మార్ న్యూస్): నల్లగొండ జిల్లా నూతన ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్పీగా పనిచేసిన అపూర్వ రావు

మిగతా 2 లో

# నూతన సంవత్సర సందర్భంగా మద్యం అమ్మకాల జోరు





హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): పండగ ఏదైనా తెలంగాణలో బీర్లు పొంగాల్సిందే. ఇక న్యూఇయర్ అయితే అమ్మకాలు ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాల్లో తెలంగాణ దుమ్మురేపింది. ఆదివారం ఒక్కరోజే 19 ప్రభుత్వ డిపోల నుంచి లక్ష 30 వేల కేసుల లిక్కర్, లక్ష 35 వేల కేసుల బీర్ అమ్మకాలు జరిగాయట. నిన్న ఒక్కరోజే ప్రభుత్వానికి రూ.125 కోట్ల ఆదాయం సమకూరిందని సమాచారం. ఈ సారి డిసెంబర్ 31 ఆదివారం కావడంతో మధ్యాహ్నం నుంచే వైన్స్‌ల వద్ద రద్దీ కనిపించింది. మూడు రోజుల్లో లిక్కర్ అమ్మకాలు ఆకాశాన్నంటాయి. డిసెంబర్ 29, 30, 31వ తేదీల్లో రూ.658 కోట్ల లిక్కర్ అమ్మకాలు జరిగినట్లు సమాచారం. మొత్తంగా 3 రోజుల్లో 4.76 లక్షల లిక్కర్ కేసులు 6.31 లక్షల బీర్ కేసులు అమ్ముడయ్యాయి. ఈ మూడు రోజుల్లో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వచ్చింది. ఇకపోతే తెలంగాణలో మందుబాబులు గత ఏడాది తెగతాగేశారు. డిసెంబర్ నెలలో అయితే రికార్డులు సృష్టించారు. కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూర్చింది. తెలంగాణలో డిసెంబర్ చివరి వారంలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయని లెక్కలు చెబుతున్నాయి.తెలంగాణలో న్యూ ఇయర్ సందర్భంగా లిక్కర్ సేల్స్ జోరుగా సాగాయిన్యూ ఇయర్ సందర్భంగా అర్ధరాత్రి 12 గంటల వరకు లిక్కర్ షాపులు, వైన్స్‌కి అనుమతి ఇవ్వడం, బార్‌లకు ఒంటి గంట వరకు ఓపెన్ ఉండడంతో మందుబాబులు పండగ చేసుకున్నారు. డిసెంబర్ 28న రూ.133 కోట్లు, 29న రూ.179 కోట్లు, 31న అత్యధికంగా రూ.313 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పేరుతో తెలంగాణలో మద్యం ఏరులై పారింది. వేడుకల పేరుతో జనం విచ్చలవిడిగా మద్యం కొనుగోలు చేశారు. 2023 డిసెంబర్ 31న పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ చేసుకున్నసంబరాలు ప్రభుత్వ ఖజానను నింపాయి. తెలంగాణలో ఒక్కరోజే 313కోట్ల రూపాయల లిక్కర్ అమ్ముడైంది. ఒక్కరోజులో మద్యం విక్రయాలు జరిగిన తీరు ఇప్పుడు అందర్ని ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.

## నాస్తికుడు బైరి నరేష్ పై అయ్యప్ప స్వాముల అడ్డుకునే యత్నం

ములుగు, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోని ఏటూరు నాగారంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. నాస్తికుడు భైరి నరేష్‌ను అయ్యప్ప స్వాములు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇవాళ ఏటూరు నాగారం మండల కేంద్రంలో డియర్ ఫంక్షన్ హాల్లో జరిగే భీంరావ్ కోరేగావ్ సమావేశానికి నరేష్ వచ్చాడు. అయితే, అతడి కారు వేగంగా వెళ్లడంతో ఓ అయ్యప్ప భక్తుడు నరసింహరావు కాలికి స్వల్ప గాయాల అయ్యాయి. దీంతో అయ్యప్ప స్వాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు అతడిపై దాడి చేసేందుకు అయ్యప్ప భక్తులు యత్నించడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఇక, విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అయ్యప్ప స్వాములు నిరసన చేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి వెంటనే బైరి నరేష్ ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## కాంట్రాక్టు ఉద్యోగులు సమర్పించిన పీహెచ్డీలు అసలా నకిలీవా..?

మొదటి పేజీ తరువాయి

పీహెచ్డీలు, పీజీలు చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో సమగ్రంగా దర్యాప్తుచేసి నివేదిక అందజేయాలని అక్టోబరులోనే కోరినా ఎన్నికల ప్రక్రియ కారణంగా అడుగు ముందుకు పడలేదని సమాచారం. డిగ్రీ కాలేజీల్లోని సుమారు 800 మందికిపైగా కాంట్రాక్టు, పార్టైం అధ్యాపకుల క్రమబద్ధీకరణ కోసం గత ఏడాది ఏప్రిల్లో సంబంధిత కాలేజీల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వాటికి ఈ ఏడాది జులైలో ఆర్థికశాఖ అనుమతితోపాటు మంత్రివర్గ ఆమోదం కూడా లభించింది. కాంట్రాక్టు లేదా పార్టైం లెక్చరర్లను క్రమబద్ధీకరించాలంటే పీజీతో పాటు పీహెచ్డీ ఉండాలి. లేదా నెట్, సెట్ అర్హత సాధించాలి. దీంతో ఎక్కువమంది పీహెచ్డీలు పూర్తిచేసినట్లు ధ్రువపత్రాలు సమర్పించారు. ముందుగా కొందరిని క్రమబద్ధీకరించిన తర్వాత మరిన్ని ప్రతిపాదనలు వచ్చాయి. పీహెచ్డీలన్నీ ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు వర్సిటీలవే కావడం, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్ప్రదేశ్, తమిళనాడు, సిక్కిం, పాండిచ్చేరి, అరుణాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఝార[illegible]ండ్, హరియాణా, ఒడిశా తదితర రాష్ట్రాల్లోని 40 విశ్వవిద్యాలయాల నుంచి పీహెచ్డీలు పొందిన వారే 140 మందికి పైగా ఉండటంతో అధికారులు కంగుతిన్నారు. అనుమానం వచ్చి తనిఖీ చేయించారు. సమస్య మరింత తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారులే వాటిని నిగ్గుతేల్చాల్సిందిగా హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లోని సెంట్రల్ క్రైం స్టేషన్ అధికారులకు లేఖ రాసినట్లు తెలిసింది.

## లోక్‌సభ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కాంగ్రెస్ పావులు

**వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న అగ్రనేతలు**

**సొంతంగా మెజార్టీ సాధించే సీట్ల గెలుపుపై కసరత్తు**

**నితీశ్‌కు ఇండియా కూటమి కన్వీనర్ పదవి అప్పగించే ఛాన్స్**

**సీట్ల పంపకాల్లో గందరగోళం లేదన్న ఎన్సీపి నేత సుప్రియా సూలె**




హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగుల వేస్తోంది. ఓ వైపు ఇండియాకూటమిని బలోపేతం చేస్తూనే..స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేలా సీట్లు సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లలో స్వతంత్రంగా పోటీ చేయాలనే అంశంపై కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. సుమారు 290 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. రెండ్రోజుల పాటు డిసెంబర్ 29-30 తేదీల్లో జరిగిన అలయెన్స్ కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకాభిప్రాయానికి వచ్చినట్టు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లలో స్వతంత్రంగా పోటీ చేయాలనే అంశంపై కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. సుమారు 290 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. రెండ్రోజుల పాటు డిసెంబర్ 29-30 తేదీల్లో జరిగిన అలయెన్స్ కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకాభిప్రాయానికి వచ్చినట్టు చెబుతున్నారు. కూటమి వ్యూహాలను రూపొందించేందుకు ఏర్పాటైన అలయెన్స్ కమిటీ ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించనుంది. దీనికి ముందుగా, జనవరి 4న ఆయన ఒక కీలక సమావేశాన్ని ఖర్గే ఏర్పాటు చేయబోతున్నారు. సీట్ల పంపకాల ఏర్పాట్లను ఖరారు చేసేందుకు అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో ఆయన ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాగా, దేశవ్యాప్తంగా తమ భాగస్వామ్య పార్టీల నుంచి 85 లోక్‌సభ సీట్లను కాంగ్రెస్ పార్టీ కోరే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది. పార్టీ అంతర్గత చర్చలు అనంతరం భాగస్వామ్య పార్టీలతో సీట్ల పంపకాల ఒప్పందాన్ని స్థిరపరచేందుకు తదుపరి సంప్రదింపులు జరుపనుంది. తద్వారా కూటమి భాగస్వామ్య పార్టీలను మరింత బలపడేలా చేస్తూనే గరిష్టంగా ఎన్నికల గెలుపు అవకాశాలను మరింత పెంచుకోవాలని కాంగ్రెస్ ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే సీట్ల పంపకాల అంశంలో గందరగోళం నెలకొందన్న వార్తలను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఎంపి సుప్రియా సూలే సోమవారం కొట్టిపారే శారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్, శివసేన (యుబిటి) నేత ఉద్ధవ్ థాకరేల మధ్య గతేడాది డిసెంబర్‌లో జరిగిన సమావేశంలో .. సీట్ల పంపంకంలోని అన్ని విషయాలపై స్పష్టత వచ్చిందని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి గందరగోళం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై మరో 8-10 రోజుల్లో అధికారికంగా ప్రకటన వెలువడుతుందని అన్నారు. పొత్తులో ఉన్నందున సీట్ల పంపిణీ ఫార్ములాలో హెచ్చు తగ్గులు వస్తుంటాయని చెప్పుకొచ్చారు. డా. అంబేద్కర్ మనవడు, మాజీ ఎంపి ప్రకాష్ అంబేద్కర్ ఇండియా ఫోరంలో కీలక పాత్ర పోషిస్తారని మీడియా ప్రశ్నకు సమాధాన మిచ్చారు. ఇకపోతే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా ఏర్పాటైన ఇండియా బ్లాక్‌లో తొలి కీలక పరిణామం చోటుచేసుకోనుంది. కూటమిలో కీలక బాధ్యతలను బీహార్ సీఎం, జేడీయూ చీఫ్ నితీష్ కుమార్‌కు అప్పగించనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆసక్తికరంగా కొద్ది రోజుల క్రితం వరకూ కూటమి తీరుపై అసంతృప్తితో ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో నితీష్ కుమార్‌ను కూటమి కన్వీనర్‌గా చేసే విషయాన్ని కాంగ్రెస్ సీరియస్‌గా పరిశీలిస్తోంది. ఇది జనతా దళ్ (యూనైటెడ్) చిరకాల డిమాండ్‌గా కూడా ఉంది. నితీష్‌కు కూటమి కన్వీనర్ పగ్గాలు అప్పగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆయనతో సంప్రదింపులను ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. కుల ఆధారిత లెక్కలు, రిజర్వేషన్ అంశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లే ముందు కాంగ్రెస్ తమను ముందుగా సంప్రదించ లేదని నితీష్ ఇటీవల ఆ పార్టీపై గుర్రుమన్నారు. జేడీయూలో ఎలాంటి చీలకలకు ఆస్కారం లేకుండా నితీష్ కుమార్ ఇటీవల వేగంగా పావులు కదిపారు. పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో జేడీయూ అధ్యక్ష పదవికి లలన్ సింగ్ రాజీనామా చేయడం, ఆ వెంటనే జేడీయూ చీఫ్ పగ్గాలు నితీష్ చేపట్టడం చకచకా జరిగిపోయాయి. కీలకమైన లోక్‌సభ ఎన్నికలు తరుముకొస్తు?న్న వేళ పార్టీ దిగ్గజమైన నితీష్‌కుమార్ అధ్యక్ష పగ్గాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ ప్రముఖులు నిశ్చితాభిప్రాయం వ్యక్తం చేశారు. అదీగాకుండా, లలన్ సింగ్ పనితీరు, నితీష్‌ను కీలకవ్యక్తిగా ఫోకస్ చేసే విషయంలో ఇండియా కూటమి నేతలతో సరైన రీతిలో ఆయన వ్యవహరించకపోవడంపై కూడా ఆ పార్టీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. బీహార్‌లోని అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆర్జేడీకి లలన్ సింగ్ దగ్గరవుతున్నారనే సంకేతాలు కూడా వెలువడ్డాయి. ఈ క్రమంలో లలన్ సింగ్ రాజీనామా చేయడం, పార్టీ చీఫ్ పగ్గాలు నితీష్ దక్కించుకోవడం ద్వారా పార్టీపై తనకున్న పట్టును నితీష్ మరోసారి నిరూపించుకున్నారు.

## గవర్నర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, జనవరి 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్ భవన్ లో గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ లో గవర్నర్ తమిళిసైకి రేవంత్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు పలువురు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళ సై మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు సుమారు 3, 500 మందిని కలిశాను అని గవర్నర్ తమిళ సై సౌందరరాజన్ తెలిపారు. 4 గంటల పాటు పబ్లిక్ కి అందుబాటులో ఉన్నాను బొకేలు వద్దు బుక్స్, నోట్స్ ఇవ్వమని నా సూచన చాలా మంది రాజ్ భవన్ కి వచ్చి బుక్స్ ఇచ్చారు. అందరికి ధన్యవాదాలు తెలంగాణ ప్రజల ప్రేమ ఆప్యాయత మరువలెను అని ఆమె పేర్కొన్నారు. ఈ రోజు గవర్నర్ పేరుతో వాట్సప్ ఛానెల్ ను లాంఛ్ చేసాను.. రాజ్ భవన్ కి సంబంధించి అన్ని అప్ డేట్స్ ఈ ఛానెల్ లో ఉంటాయని తమిళ సై వెల్లడించారు. తెలంగాణ ప్రజలు ఈ సంవత్సరం ప్రతి పనిలో విజయం సాధించాలని ఆమె సూచించారు.

## హైదరాబాద్ లో అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలో నూతన సంవత్సర వేడుకలను అంబరాన్నంటాయి. పలువురు కుటుంబ సమేతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోగా, మరోవైపు హొటళ్లు, పబ్‌లు, రిసార్ట్స్‌లో యువతరం ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు అబ్బురపరిచే కార్యక్రమాలు నిర్వహించారు. అర్ధరాత్రి దాటే వరకు రోడ్లపై తిరుగుతూ పటాకులు కాల్చి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. అయితే పోలీసులు ముమ్మరంగా డ్రంక్ డ్రైవ్ (డ్రంక్ అండ్ డ్రైవ్) తనిఖీలు నిర్వహించి డ్రగ్స్ బానిసలను పట్టుకున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో 2700కు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో హైదరాబాద్‌లో 1500 కేసులు, సైబరాబాద్‌లో 1241 కేసులు నమోదయ్యాయి. రాచకొండలో 517 కేసులు నమోదయ్యాయి. మొత్తం మూడు కమిషనరేట్ల పరిధిలో 3500లకు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. సైబరాబాద్ పరిధిలో ఇద్దరు మహిళలు సహా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 1239 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 938 బైక్‌లు, 21 ఆటోలు, 275 కార్లు, 7 భారీ వాహనాలను సీజ్ చేశారు. పలుచోట్ల వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు జంటనగరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. నగరంలోని ఫ్లై ఓవర్లు, ఓఆర్‌ఆర్‌లను ఆదివారం రాత్రి 8 గంటలకు మూసివేశారు.

## నూతన సంవత్సరం దేశానికి ఎంతో ముఖ్యమైనది

తెలంగాణ బ్యూరో, జనవరి 01 (తీన్మార్ న్యూస్): ఆంగ్ల నూతన సంవత్సరం 2024 దేశానికి ఎంతో ముఖ్యమైన సంవత్సరంగా కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ప్రజలకు కిషన్ రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. 2024 దేశానికి ఎంతో కీలకం కానుందని, పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయని ఆదివారం వెల్లడించారు. ప్రధాని మోడీ ఈ ఏడాది హ్యాట్రిక్ సాధించబోతున్నారని తెలిపారు. మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని, దేశ ప్రతిష్టను పెంచేలా అనేక చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు చేపడుతూ మోడీ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు.

## పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ విజయవంతంపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం

హైదరాబాద్, జనవరి 01 (తీన్మార్ న్యూస్): భారత అంతరిక్ష సంస్థ చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాకెట్ విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేతలను ఆయన అభినందించారు. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ సిఎం రేవంత్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అగ్రరాజ్యం అమెరికా తర్వాత బ్లాక్‌హోల్స్‌ను అధ్య యనం చేయడానికి అబ్జర్వేటరీ ఉప గ్రహం ఉన్న రెండో దేశంగా భారత్ అవతరించిందని కొనియాడారు. ఆంగ్ల నూతన సంవత్సరం రోజు మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో రోదసీలో భారత పతాకాన్ని ఎగుర వేసిందన్నారు. ఈ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో మరో శిఖరం చేరిందన్నారు. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వీఆర్‌ఏల సమస్యలను పరిష్కారానికి సీఎంని కోరిన రెవెన్యూ సంఘాలు



మొదటి పేజీ తరువాయి

నేతృత్వంలో పలు రెవెన్యూ సంఘాల నాయకులు కలిశారు. ఐదు నెలల వేతన బకాయిలు, గుర్తింపు సంఖ్య కేటాయింపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ సమయంలో వయసు పైబడిన వారు, మృతి చెందిన వారి స్థానంలో వారసులకు అవకాశం కల్పించాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి త్వరగా చర్యలు చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎంని కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, వీఆర్‌ఏ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## నల్లగొండ నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చందనా దీప్తి

మొదటి పేజీ తరువాయి

సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌కి బదిలీ కాగా ఆమె స్థానంలో 2012 బ్యాచ్‌కు చెందిన చందనా దీప్తిబాధ్యతలు స్వీకరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్పీని అడిషనల్ ఎస్పీ హనుమంతరావు, ఎస్‌బీ డీఎస్పీ సోమ్ నారాయణ్ సింగ్, నల్లగొండ డీఎస్పీ శ్రీదర్ రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ సైదా, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, డీపీవో సిబ్బంది ఎస్పీకి స్వాగతం పలికారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# దళిత నేత ప్రధాని కాగలరా?

విపక్ష 'ఇండియా' కూటమిలో ప్రధాని అభ్యర్థిత్వంపై చెలరేగిన చిచ్చు కొత్తమలుపు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. పిఎం అభ్యర్థిపై నిర్ణయం తీసుకోవాలని కూటమిలోని కొన్ని పార్టీలు అభిప్రాయపడుతుండగా, ఆ అవసరం లేదని ఎన్‌సిపి తదితర పక్షాలు అంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ కూడా అందుకు సుముఖంగా వున్నట్లులేదు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో 'ఇండియా' కూటమి ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేరును టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రతిపాదించడంతో అకస్మాత్తుగా కలకలం రేగింది. దీనిపై తాజాగా స్పందించిన ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ ఎన్నికలకు ముందు పిఎం అభ్యర్థిని ప్రకటించకపోతే ఏమీ కాదంటూ కొట్టిపారేశారు. ఎమర్జెన్సీ తర్వాత 1977లో జరిగిన ఎన్నికల్లోనూ ముందుగా పిఎం అభ్యర్థిని ప్రకటించలేదని, ఎన్నికల తర్వాత మొరార్జీ దేశాయ్ ప్రధాని అయ్యారని ఆయన గుర్తుచేశారు. మార్పు రావాలని ప్రజలు కోరుకుంటే, దానికి అనుగుణంగా వారు నిర్ణయం తీసుకొంటారని చెప్పారు. వాస్తవానికి ఢిల్లీ భేటీకి రెండు రోజుల ముందు ప్రధాని అభ్యర్థిత్వం విషయమై ఎన్నికల అనంతరమే నిర్ణయం తీసుకుంటామని స్వయంగా మమతా ప్రకటించారు. అయితే ఆ మరుసటి రోజున ఆమె ఢిల్లీలో కేజ్రీవాల్‌ను కలవగానే ఆమె ధోరణి మారిపోయింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలలో కూటమి భాగస్వామ్య పక్షాలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరించేందుకు కారణమైన రాహుల్ గాంధీని ఇరకాటంలో పడేసేందుకు ఈ ప్రతిపాదన తెరపైకి తెచ్చిన్నట్లు కనిపిస్తోంది.

అదే సమయంలో ఖర్గే పేరును ప్రతిపాదించడం ద్వారా దేశంలో ఇప్పటికే బిజెపి పట్ల విముఖంగా వున్న దళిత వర్గాల ఓట్లను మూకుమ్మడిగా పొందవచ్చని ఎత్తుగడని మమత, కేజ్రీవాల్ ప్రతిపాదించారు. అయితే, ఓ దళితుడిని ప్రధానిగా ఎన్నుకునేందుకు దేశంలోనే రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయా? అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. బిఎస్‌పి మినహా ఈ విషయంలో ఇప్పటి వరకు ఎవ్వరూ సానుకూలంగా స్పందించిన దాఖలాలు లేవు. గతంలో కనీసం నాలుగు సార్లు 'దళిత ప్రధాని' ప్రతిపాదన వచ్చిన్నప్పుడు కీలక రాజకీయ నాయకులు మూకుమ్మడిగా వ్యతిరేకించడం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఆ నాలుగు సార్లు కూడా ప్రధాని పదవికి పరిగణనలోకి వచ్చిన పేరు బాబు జగ్జీవన్ రామ్ కావడం గమనార్హం. మొదటగా 1975లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎన్నికల చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆమె కేబినెట్‌లో సీనియర్ మంత్రి అయిన బాబు జగ్జీవన్ రామ్‌ను 'తాత్కాలిక ప్రధాని'గా చేయాలనే ప్రతిపాదన కాంగ్రెస్ వర్గాలలో వచ్చింది. అయితే, రాజ్యాంగంలో 'తాత్కాలిక ప్రధాని' అనే అంశం లేదని, ప్రధాని అంటే పూర్తి స్థాయి ప్రధాని కాగలరని భయంతో ఒకసారి ఆ పదవి చేబడితే ఆయనను దింపడం కష్టం కాగలదని అందుకు వ్యతిరేకించిన ఇందిరాగాంధీ ఏకంగా ఎమర్జెన్సీని విధించారు. ఆ తర్వాత 1977లో మొదటిసారి కాంగ్రెస్ ఓటమి చెంది, జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన్నప్పుడు సుమారు 300 మంది ఎంపిలున్న ఆ పార్టీలో మాజీ లోక్ దళ్, మాజీ జనసంఘ్ పార్టీలకు చెందిన 200 మంది వరకు జగ్జీవన్ రామ్ పేరును ప్రతిపాదించారు. అయితే నాడు పెద్దరికం చేసిన జయప్రకాశ్ నారాయణ్, జెబి కృపాలిని ఎంపిల అభిప్రాయాలను వ్యక్తిగతంగా సేకరించే పేరుతో కేవలం 35 మంది ఎంపిలున్న మొరార్జీ దేశాయ్ పేరును ప్రకటించారు. ఆనాడు జగ్జీవన్ రామన్‌ను ప్రధానిగా చేస్తే పూర్తి కాలం ఆ ప్రభుత్వం మనుగడ సాగించి ఉండెడిది అనడంలో సందేహం లేదు. ఆ సందర్భంగా 'భారత దేశంలో ఓ దళిత్ ప్రధాని కావడం అసంభవం' అంటూ జగ్జీవన్ రామ్ తన అసంతృప్తిని బహిర్గతం చేశారు. ఇప్పటికి కూడా పరిస్థితులలో పెద్దగా మార్పు కనబడటం లేదు. తిరిగి 1979లో అవిశ్వాస తీర్మానంతో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం పడిపోయినప్పుడు మరోసారి జనతా పార్టీ జగ్జీవన్ రామ్‌ను ప్రధానిగా ప్రతిపాదించింది. కానీ నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వ్యక్తిగత రాగద్వేషాలను దృష్టిలో ఉంచుకొని మెజారిటీ లేని చరణ్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేయడం, ఆ ప్రభుత్వం పార్లమెంట్ ముఖం చూడలేకపోవడం తెలిసిందే. తిరిగి 1980లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు దేశ చరిత్రలో మొదటిసారిగా 'ఎవ్వరు ప్రధాని?' అనే అంశంపై జరిగాయి. 'దళిత ప్రధానిని ఎన్నుకోండి' అంటూ జనతా పార్టీ ప్రజల ముందుకు వెళ్ళింది. కానీ ఫలితం లేకపోయింది. ఆ తర్వాత ఏ పార్టీ కూడా దళిత ప్రధాని అంశాన్ని తెరపైకి తీసుకు రాలేదు. తమ పార్టీ మైనారిటీ, దళిత్, గిరిజన వర్గాలకు రాష్ట్రపతి పదవులు కల్పించిందని చెబుతున్న ప్రధాని నరేంద్ర మోడీ సహితం 'దళిత ప్రధాని' అనలేరు. ప్రధాన మంత్రి పదవి ఇవ్వకపోయే, కనీసం కేంద్రంలో అధికారంలో వున్న ఏ రాజకీయ పార్టీ కూడా ఓ దళితుడిని తమ పార్టీ అధ్యక్షునిగా చేసే సాహసం చేయలేకపోతోంది. మొదటిసారిగా 60వ దశకంలో ఇందిరా గాంధీ దామోదరం సంజీవయ్య ను దేశంలో మొదటిసారి దళిత్ ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌లో చేస్తే, నాటి కాంగ్రెస్ పార్టీలోని పెత్తందారీ వర్గాలు ఆయనను గద్దె దించే వరకు నిద్ర పోలేదు. ఆయనను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఆమె చేసినా సొంత పార్టీ వారే సహాయ నిరాకరణ కావించారు. మూడున్నర దశాబ్దాల అనంతరం ప్రధానిగా వాజపేయి బిజెపి అధ్యక్షునిగా బంగారు లక్ష్మణ్‌ను అధ్యక్షునిగా చేస్తే ఆయన కూడా సొంత పార్టీ వారి నుండే సహాయ నిరాకరణ ఎదుర్కొన్నారు. దామోదరం సంజీవయ్య, బంగారు లక్ష్మణ్‌లపై సొంతపార్టీ వారే కుట్ర పూరితంగా 'అవినీతి ఆరోపణలు' చేరి వారిని అపఖ్యాతి పాలు కావించారు. దళిత నేతలుగా సొంత పార్టీ నేతల నుండే 'వివక్ష'కు గురయ్యారు. ఇందిరా గాంధీ, వాజపేయి వంటి బలమైన నేతలు అండగా వున్నప్పటికీ సంజీవయ్య, లక్ష్మణ్ ఎదురీతకు గురవాల్సి వచ్చింది. అందుకనే ఓ దళితుడిని ప్రధానిగా అంగీకరించేందుకు భారతీయ సమాజం ఇంకా సిద్ధంగా లేదని స్పష్టం అవుతుంది. సమీప భవిష్యత్తులో సహితం అటువంటి అవకాశం కనిపించడం లేదు. కనీసం కేంద్ర మంత్రి వర్గంలో హోం, రక్షణ వంటి మంత్రిత్వ శాఖలు కొన్ని సందర్భాలలో లభించినా కీలకమైన ఆర్థిక శాఖ ఇప్పటి వరకు దళిత నేతలకు లభించలేదు. ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గంలో కీలకమైన మంత్రిత్వ శాఖలలో ఒక దళిత్ కూడా లేరు. అందుకనే ఇప్పుడు 'ఇండియా' కూటమిలో 'దళిత్ ప్రధాని' అంశాన్ని మమత, కేజ్రీవాల్ తరపైకి తీసుకు రావడం వెనుక వ్యక్తిగతంగా ఖర్గే పేరును ప్రతిపాదించే ఉద్దేశం కాకపోవచ్చు.

# కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి నీ అభినందనలు

**- పీఆర్టీయూ టీయస్ పాలకవీడు మండల శాఖ అధ్యక్షుడు కొణతం వెంకటరెడ్డి**

పాలకవీడు, జనవరి 01(తీన్మార్ న్యూస్): కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ని సోమవారం సాయంత్రం కోదాడలోని ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో కలిసి, వారిని పీఆర్టీయూ టీయస్ పాలకవీడు మండల శాఖ పక్షాన అధ్యక్షుడు కొణతం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంధం ధర్మరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, నిరంతరం ప్రజా సమస్యల సాధనలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యే ని సీపీయస్ రద్దు, మెరుగైన పీఆర్సీ, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు, 317 జీవో రద్దు, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలనింటిని పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, తదనుగుణంగా తమ వంతు సహాయసహకారాలు అందించడానికి కృత నిశ్చయంతో ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



మండల నాయకులు ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



ఆలేరు, జనవరి 01(తీన్మార్ న్యూస్): నూతన సంవత్సర వేడుకలను ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఉదయం నుంచే వాకిట్లో ముగ్గులు వేయగా యువకులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం విరాళం

**- అందజేసిన చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**- మహా పడిపూజలో ప్రత్యేక పూజలు చేసిన చామల**



ఆలేరు, జనవరి 01(తీన్మార్ న్యూస్): ఆలేరు పట్టణ కేంద్రంలో ఆదివారం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణం కోసం టిపిసిసి ఉపాధ్యక్షులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అయ్యప్ప స్వామి మాలాదారులకు మరియు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు భారీ విరాళం రూ.751000/- రూపాయలు ప్రకటించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని శాంతినగర్ లో గురు స్వామి బ్రహ్మశ్రీ డాక్టర్ వెంకటేశ్వర శర్మ. గురు స్వామి యాట శివ ల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అయ్యప్ప స్వామి దీవెనలతో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం తో పాటు ఆలేరు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని మొక్కుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అద్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్, జిల్లా ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షులు ఆరే ప్రశాంత్ గౌడ్, గురు స్వామి, యాట కిషోర్, ముదిరాజ్ తో పాటు పలువురు అయ్యప్ప గురు స్వాములు. మాలాదారులు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఎమ్మెల్యే వీరేశంకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు



**- తెలిపిన కాంగ్రెస్ నాయకులు**

రామన్నపేట, జనవరి 01(తీన్మార్ న్యూస్): నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు రామన్నపేట మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల బోకెలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ నాయకుని జన్మదిన వేడుకలు

**- ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు**

రామన్నపేట, జనవరి 01(తీన్మార్ న్యూస్): మండల యువజన కాంగ్రెస్ నాయకుడు ఏటెల్లి పరమేష్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సంద్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం కేక్ కట్ చేసి స్వీట్ తినిపించి పరమేష్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగుల వెంకట్ రాజారెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, జినుకల ప్రభాకర్, గోదాసు పృధ్వీ రాజ్, ఎండీ రెహన్, సాల్వేరు లింగం, గోదాసు భాస్కర్, కేస కిరణ్, నోముల ప్రవీణ్ కుమార్, మోటే క్రాంతి, పల్లపు రవి, సతీష్, బట్టే సంతోష్, రవి, బట్టే సంతోష్, మల్లం శివ గౌడ్, శిరబోయిన రవి, సతీష్, గణేష్, సైదులు, రవి, సురేష్, శరత్, పబ్బు మచెందర్,



తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డికి కొత్త సంవత్సర శుభాకాంక్షల వెల్లువ



ఇబ్రహీంపట్నం, జనవరి 01(తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజా పాలన కి సంబంధించి 6 గ్యారంటీ పథకాలను నిజమైన అర్హులకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచించినట్లు చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు.

# క్రీడలతో మానసికోల్లాసం

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**

మంచాల, జనవరి 01(తీన్మార్ న్యూస్): క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంచాల్ మండల్ అస్మత్ పూర్ లో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మంథని శివ యాదవ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకుగానూ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు.



చదువుతోపాటు క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. యువత క్రీడల్లో రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఓరిగంటి మహేష్ గౌడ్, చీమల జంగయ్య యాదవ్, స్థానిక సర్పంచ్ హరిప్రసాద్, ఇతర నాయకులు, యువకులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వాసవి పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు




ఆలేరు, జనవరి 01(తీన్మార్ న్యూస్): నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్ హాల్ లో వాసవి పరపతి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కేక్ కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి పరపతి సంఘం అధ్యక్షులు ఐడియా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంతోష్, అయిత వెంకటేష్, నీల రామన్న, కస్తూరి వెంకటేష్, తోట ప్రశాంత్, సముద్రాల రవి, ఎరం బాలచందర్, బచ్చు మణికంఠ, కొత్త వీరేశం, జిల్లాల శ్రీను, చందా సాయిబాబా, కస్తూరి శ్రీను, నాగబండి నాగేందర్, తదితరులు ఉన్నారు.

# ఎరుపెక్కిన ఎర్రసముద్రం

**రంగంలోకి అమెరికా హెలికాప్టర్లుహౌతీల మూడు బోట్లు ధ్వంసం**

**10 మంది తిరుగుబాటుదారుల మృతి**

బీరుట్: ఎర్రసముద్రంలో రవాణా నౌకలపై నవంబరు నుంచి వరుస దాడులకు తెగబడుతున్న హౌతీ తిరుగుబాటుదారులకు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా హెలికాప్టర్ల దాడిలో 10 మంది హౌతీలు మృతి చెందారు. డెన్మార్క్ షిప్పింగ్ సంస్థ మెర్స్ హంగ్‌జౌ రవాణా నౌకను ఆదివారం హౌతీ తిరుగుబాటుదారులు హైజాక్ చేసేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం నాలుగు బోట్లలో నౌక సమీపానికి చేరుకున్నారు. ఈ సమయంలో మెర్స్ సిబ్బంది పంపిన సందేశాలతో రంగంలోకి దిగిన అగ్రరాజ్య హెలికాప్టర్లు కాల్పులు జరిపాయి. 3 బోట్లను ముంచివేశాయి. నాలుగో బోటు సంఘటనా స్థలం నుంచి తప్పించుకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో 10 మంది హౌతీలు మరణించినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన తర్వాత మెర్స్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 48 గంటల పాటు తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంఘటనపై అమెరికా స్పందిస్తూ.. శనివారం కూడా మెర్స్ రవాణా నౌకపై హౌతీలు క్షిపణులను ప్రయోగించారని.. వాటిని తాము తిప్పికొట్టామని తెలిపింది. మళ్లీ ఆదివారం చిన్న బోట్లతో దాడికి ప్రయత్నించారని పేర్కొంది. అమెరికా దాడిపై హౌతీ తీవ్రంగా స్పందించింది. ఎర్రసముద్రంలో అమెరికా సహా ఏ దేశం జోక్యం చేసుకున్నా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతు



న్నాయి. గడిచిన 24 గంటల్లో 100 మంది మృతి చెందారని, 286 మంది గాయాలయ్యాయని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. గాజాపై తాము చేస్తున్న యుద్ధం ఇప్పట్లో ఆగదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు.

**అప్రమత్తమైన భారత్..**

దిల్లీ: అరేబియా సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతోన్న నేపథ్యంలో భారత నౌకాదళం అప్రమత్తమైంది. నిఘాను మరింత పెంచింది. యుద్ధనౌకలను, ఇతర వ్యవస్థలను మోహరిస్తున్నట్లు పేర్కొంది. "ఎర్ర సముద్రం, ఏడెన్ సింధుశాఖ, మధ్య/ఉత్తర అరేబియా సముద్రంలో గత కొన్ని వారాలుగా వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగుతున్నాయి. ఎంవీ రూయెన్, ఎంవీ కెమ్ ప్లూటోలపై జరిగిన దాడులు భారత్ ఈఈజీ (ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్) సమీపానికి చేరినట్లు కనిపిస్తున్నాయి. ఇటువంటి దాడులను దీటుగా తిప్పికొట్టేందుకు గాను సముద్ర నిఘాను గణనీయంగా పెంచాం' అని భారత నౌకాదళం పేర్కొంది.

# మోత్కుపల్లికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన వెంకటేష్ గౌడ్



తుర్కపల్లి, జనవరి 01(తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి వర్యులు మోత్కుపల్లి నర్సింహులును సోమవారం మర్యాద పూర్వకంగా తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ కలసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఆలేరు నియోజకవర్గం అబివృద్ధి పథంలో నడుస్తుందని ప్రజలు సుక సంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## కోరుకున్న కోరిక నెరవేరినందుకు చింతకుంట ఆంజనేయ స్వామి



### - మొక్కు చెల్లించిన పుల్లూరు జైపాల్ రెడ్డి

పెబ్బేరు, జనవరి 01(తీన్మార్ న్యూస్): వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గెలుపు కోసం చింతకుంట ఆంజనేయ స్వామి దగ్గర మొక్కిన మొక్కును నేడు మన గ్రామ నాయకులు జైపాల్ రెడ్డి 101టెంకాయలతో మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేరు మీద అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శశిధర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, వడ్డే హనుమంతు, ముష్టి వెంకటన్న, రామకృష్ణ, పెబ్బేరు మండల ఎస్సి సెల్ అధ్యక్షులు గంధం బాలచందర్, ఉప్పరి శేఖర్, దేవమ్మ, ఎల్లమ్మ, గంధం సాయిప్రసాద్, గ్రామ యూత్ అధ్యక్షుడు రాజేష్, పృథ్వి, తదితరులు పాల్గొన్నారు.

## ఊడ్చే దేవరు..? కడిగేదెవరు..?

- స్వీపర్లు లేరు.. స్కావెంజర్లు లేరు
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుకపోతున్న చెత్తా, చెదారం
- మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తం
- చేతులెత్తేస్తున్న జిపి పారిశుద్ధ్య సిబ్బంది

మల్హర్ రావు: ప్రభుత్వ పాఠశాలకు రూ. వేల కోట్లు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెబుతోన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో స్వీపర్లు, స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలు అపరిశుభ్రతకు చిరునామాగా మారాయి.పాటశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు కడిగేవారు లేకపోవడంతో చెత్తతో నిండిపోయి నిరుపయోగంగా మారాయి. మండలంలోని 5 జిల్లా పరిషత్, ఒక ప్రాథమికోన్నత,27 ప్రాథమిక, ఒక మోడల్ పాఠశాల, ఒక కస్తూరిబ్బా పాఠశాల మొత్తం పాటశాలలు 37 ఉన్నాయి. వీటిలో మొత్తం 1853 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. వీటిలో ఒక్క పాఠశాలలో కూడా అటెండర్లు, స్వీపర్లు, పార్ట్ స్వీపర్లు లేకపోవడం చాలా విచారకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా 2015లో అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి రూ.2000 నుంచి రూ.2.500 ఇస్తోంది.మూడేళ్ళ క్రితం 2020 తరువాత మండలంలో 33 మందిని స్కావెంజర్లను తొలగిస్తూ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి పాటశాలను శుభ్రం చేసి



బాధ్యత అప్పగించారు. కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### నెలలో ఒకటి, రెండు సార్లే

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని సర్పంచ్ ల చుట్టూ ప్రదక్షణలు చేస్తేనే నెలలో ఒకటి,రెండు సార్లు మాత్రమే పాఠశాలల్లో ఆవరణ,మైదానాలు శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, మూత్రశాలలు మరుగుదొడ్లు పట్టించుకునేవారే కరువైయ్యారు.పలు పాఠశాలల్లో విద్యార్థులే శుభ్రం చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

### మూడేళ్ళుగా తీరని సమస్య

మండలంలోని కొయ్యూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, వళ్లెంకుంట గ్రామంలో హస్కూల్, ప్రాథమిక పాఠశాలలు, ఎడ్లపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, రుద్రారం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, చిన్నతూండ్లలో ప్రాథమిక పాఠశాల, మల్లారం గ్రామంలో హైస్కూల్, ప్రాథమిక పాటశాల, రామరావు పల్లి, నాచారం, అమీరా బాద్, గాధంపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, తాడిచెర్లలో హస్కూల్, ఆన్ సాన్ పల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలు మన ఊరు-మనబడి పథకానికి ఎంపికైయ్యాయి. ఈ పాఠశాలల్లో నీటి పంపులు, విద్యుదికరణ నామమాత్రంగా చేపట్టారు కానీ మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేసేవారు లేరు. దీనిపై పలుమార్లు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు గత ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు మొరపెట్టిన ఫలితం లేదు. మూడేళ్ళుగా సమస్య తీరడం లేదు. ఇప్పటికైనా కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి స్వీపర్లను, స్కావెంజర్లు, నైట్ వాచ్ మెన్లను నియమించాలని టీచర్లు కోరుతున్నారు. వెంటనే నియమించాలి.. అక్కల బాపు యాదవ్ యువైఏఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లను తొలగించడం బాధాకరం. పాఠశాలల్లో చెత్త,చెదారం తొలగించేవారు, మరుగుదొడ్లు కడిగేవారు లేరు. ప్రభుత్వం వెంటనే పాఠశాలల్లో పార్ట్ టైం స్వీపర్లను నియమించాలి.

## ఎస్సీ కాలనీకి టెంటు సామాగ్రి బహుకరణ



రాజాపేట, జనవరి 01(తీన్మార్ న్యూస్): రాజపేట గ్రామంలో 6వ వార్డ్ లో ఎస్సి కాలనిలో వార్డు సభ్యులు కోయ మధు కాలనీ కి 50,000 రూపాయల విలువైన టెంట్ సామగ్రి సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా వార్డ్ మెంబర్ మధును కాలనీవాసులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయ ఉపేందర్, పేదోళ్ల ప్రభాకర్, కోయ జాన్, రమేష్, సిగ్గ అంజి, కోయ రాజు, కమలాకర్, యాకుబ్, భాగ్య, నాగమ్మ, జన్నమ్మ, పోచమ్మ, బాల్ నర్సమ్మ, లచ్చమ్మ, కరణ్, కాలనివాసులు పాల్గొన్నారు. కోయ మధును పలువురు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## పోషక బియ్యం పంపిణీతో.. అక్రమాలకు అడ్డుకట్ట పడేనా

ధరూరు:తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి పోషకాలు మిళితం చేసిన బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్) పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వులు రావటంతో ఉమ్మడి జిల్లాలో కోటా కింద బియ్యం సరఫరాకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 9,35,592 తెల్లరేషన్ కార్డులున్న లబ్ధిదారులకు ఈ బియ్యం అందనున్నాయి. మార్చి నెలలో పంపిణీ చేయగా రేషన్ డీలర్ల వద్ద మిగిలిన బియ్యం వెనక్కి రప్పించాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. వాటిని రేషన్ డీలర్లు పౌరసరఫరాల శాఖకు తిప్పి పంపాల్సి ఉంటుంది. అధికారులతో ఒప్పందం : గతంలో చౌకదుకాణాల నుంచి బియ్యం పొందిన లబ్ధిదారుల్లో చాలా మంది వాటిని వ్యాపారులకు విక్రయించేవారు. కొన్నిచోట్ల లబ్ధిదారు వేలిముద్ర నమోదు చేసి రాగానే డీలర్లు బయటికి తరలించిన సందర్భాలున్నాయి. కొంతమంది మిల్లర్లకు, ఏజెంట్లకు బియ్యం అక్రమ రవాణా దందాగా మారింది. పలు మార్లు పట్టుబడినా, కేసులు నమోదైనా అక్రమ వ్యాపారాన్ని వదలడం లేదు. ఎప్పటికప్పుడు పౌరసరఫరాల శాఖ అధికారులతో ఒప్పందం చేసుకుని దందా సాగిస్తున్నారు. ఈ క్రమంలో పోషకాలు మిళితమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని లబ్ధిదారులు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే వారి కుటుంబాలకు పూర్తి స్థాయిలో పోషకాలతో కూడిన ఆహార భద్రత లభించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు అక్రమ దందాకు అడ్డుకట్ట వేయవచ్చు.

## అంగన్ వాడీలపై ఉక్కుపాదం

### - రాష్ట్ర ప్రభుత్వం బరితెగింపు


అనంతపురం:అపరిష్కృత సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వారి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది.అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని అడ్డుపెట్టుకుని ఎక్కడికక్కడ కేంద్రాలను బలవంతంగా తెరిపిస్తోంది. కేంద్రాల తాళాలు ఇవ్వాలంటూ ఎంఎస్‌కే, సచివాలయ సిబ్బందితో సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్ చేసి బెదిరించారు. తాళాలు ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పడంతో సచివాలయ సిబ్బంది రంగంలోకి దిగి తాళాలు పగలగొట్టే విష సంస్కృతికి తెరలేపారు. ఈ చర్యల తీరుపై రాజకీయ, ప్రజా సంఘాలు సైతం పెదవి విరుస్తున్నాయి. సమ్మె చేస్తున్న సిబ్బందితో చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రభుత్వమే కఠిన నిర్ణయాలతో విరుచుకు పడటం గమనార్హం. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. అనంత, హిందూపురం, పుట్టపర్తి... వంటి కీలక ప్రాంతాల్లోనే కాదు.. ప్రతి నియోజకవర్గ కేంద్రం, సీడీపీఓ, మండల కార్యాలయాల ఎదుట పలు రూపాల్లో నిరసన చేపట్టారు. అనంత, శింగనమల, పుట్టపర్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం.. వంటి కొన్నిచోట్ల వినూత్నంగా ఆందోళన నిర్వహించారు. ఎక్కడికక్కడ తెదేపా, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన వంటి రాజకీయ పార్టీలు కూడా సంపూర్ణ మద్దతుగా పాల్గొన్నాయి. అనంత, శ్రీసత్యసాయి జిల్లాలోని 5,126 అంగన్‌వాడీ కేంద్రాలను తెరవాల్సిందేనంటూ ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. రెండు జిల్లాల కలెక్టర్, జేసీలు రంగంలోకి దిగారు. శ్రీసత్యసాయి కలెక్టర్ అరుణ్‌బాబు, అనంత జేసీ కేతన్‌గార్గ్‌లు ఇప్పటికే జిల్లా, మండల ప్రత్యేక అధికారులు, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లు, డీఆర్‌డీఏ-వైకేపీ, గ్రామ, వార్డు సచివాలయ ఇన్‌ఛార్జి, ఎమ్పీడీఓ, తహసీల్దార్లతో సమీక్ష జరిపారు. శుక్రవారం అన్ని కేంద్రాలను తెరవాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. అంగన్‌వాడీల సమ్మె



ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారం.. అయితే వైకాపా నాయకులు కేంద్రాలను దగ్గరుండి తెరిపించిన తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అనంత నగరం బిందెల కాలనీ, బీఎన్‌ఆర్ కాలనీలోని కేంద్రాల తాళాలను సచివాలయ సిబ్బంది పగలగొట్టారు. వీటిపై సిబ్బంది వారితో వాదనకు దిగారు. ఇందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలని అనంత ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉరవకొండలో తాళం పగలకొట్టడంతో సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారించారు. దీంతో అక్కడి ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. హిందూపురం పట్టణం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ముందు, సోమందేపల్లి పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. గాండ్లపెంట, తాడిమర్రి, రొద్దం, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, నార్పల, శెట్టూరు, రాప్తాడు, పుట్టపర్తి, తాడిపత్రి, గుత్తి, విడపనకల్లు, రాయదుర్గం.. వంటి మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టి తలుపులు తెరిచి ఉంచారు. రోడ్లపై నిరసనలు చేస్తే కేసులు నమోదు చేస్తామంటూ నిర్బంధించారు. గురువారం అనంత జిల్లాలో 460, శ్రీసత్యసాయి జిల్లాలో 47 చొప్పన అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

## అస్తవ్యస్తంగా వైరింగ్ వ్యవస్థ

చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు ప్రభుత్వ-అపోలో ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీ ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం.. వైద్యాధికారుల అలసత్వం రోగులకు శాపంగా మారుతోంది. ఆస్పత్రి 300 పడకల నుంచి 800కుపైగా పడకల స్థాయి పెరిగినా.. ప్రమాదాలు అంతే స్థాయిలో పొంచి ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రి అపోలో సంస్థలో విలీనమయ్యాక ఆస్పత్రి రూపురేఖలు మారిన విషయం విదితమే. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో రోగుల సంఖ్య భారీగా పెరిగింది. రోజుకు కనీసం 1200 నుంచి 1500 మంది ఆస్పత్రికి వచ్చి వెళుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా.. వాటిపై దృష్టి పెట్టలేకపోయారు. ఆస్పత్రి చుట్టూ హోస్‌పైప్‌లు, వాటికి అనుబంధంగా స్టెయిర్ కేసులను ఏర్పాటు చేసినా వాటిని ప్రారంభ దశలోనే వదిలిపెట్టేశారు. వివిధ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అగ్నిప్రమాదం జరిగితే చేదు అనుభవం ఎదురుచూసే పరిస్థితి ఉందని ఆస్పత్రి వర్గాలే గగ్గోలు పెడుతున్నాయి. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఎర్రటి పైపులైన్ వెళుతున్నా అన్నీ అలంకారప్రాయంగానే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు చిమ్మటానికి పైపులు, అలారం మోగడానికి బటన్లు ఉన్నా ఉత్తుతిగా ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి అప్పుడప్పుడు అగ్నిమాపక పరికరాలను పరిశీలించి, వినియోగించేలా చేయాల్సి ఉంటుంది. హఠాత్తుగా ప్రమాదం జరిగినా.. పరికరాలు పనిచేసేలా నిర్వహణ చేపట్టాలి. అయితే అధికారులు అప్పుడప్పుడు పరిశీలిస్తున్నామని చెబుతున్నా పరికరాలు అలాగే ఉండడం విడ్డూరంగా ఉంది. చిత్తూరు నగరంలో ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఒకే వీధిలో పదికిపైగా క్లినిక్‌లు ఉండగా.. ఆ వీధిలో అగ్నిమాపక వాహనాలు తిరగలేని పరిస్థితి ఉంది. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం



జరిగినా ఆ సమయంలో అగ్నిమాపక వాహనాలు వెంటనే వెళ్లి మంటలను ఆర్పడం కష్టంగానే ఉంది. పైగా ఆయా ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ కూడా లేదని తెలుస్తోంది. ఆస్పత్రుల్లో ప్రమాదం జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులే అంచనా వేయాలి. ప్రభుత్వాసుపత్రిలో వైరింగ్ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసినా తీగలు అతుకులు ఉన్నాయి. వేలాడుతున్న తీగలతో విద్యుదాఘాతానికి అవకాశం ఉంది. ఆస్పత్రిలో బోలెడన్ని విభాగాలు, పరికరాలు ఉండడంతో వైర్లు అధికంగా ఉండాల్సి ఉన్నా.. వాటి ద్వారా ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా ఎక్కడా అలాంటి పరిస్థితి లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో మరీ ఘోరంగా ఉంది. చాలా ఆస్పత్రుల్లో అగ్నిమాపక వాహనాలు తిరగడానికి కూడా స్థలం లేదు. అక్కడ ప్రమాదం జరిగితే ఏమీ చేయలేని పరిస్థితి. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. ఆదేశాలు అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

## ఇష్టారాజ్యంగా అక్రమ లేఅవుట్లు
## ప్రభుత్వ ఆదాయానికి గండి



హిందూపురం: హిందూపురం పురపాలక, పరిసర ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములను వాణిజ్య భూములుగా మార్చకుండానే ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా విక్రయాలు చేస్తున్నారు. దీని వల్ల పురపాలక, గ్రామ పంచాయతీలు, అహుడాకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. హిందూపురం ప్రముఖ వాణిజ్య కేంద్రం కావటం, బెంగళూరుకు సమీపంలో ఉండటంతో ఎప్పటికైనా ఈ ప్రాంతంలో విలువ పెరుగుతుందనే ఉద్దేశంతో ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

హిందూపురం పరిసర ప్రాంతాలు మోతుకపల్లి, దండురోడ్డు, కొల్లకుంట, పూలకుంట, పులమతిరోడ్, శ్రీకంఠపురం, బెంగళూరురోడ్, గ్రామీణ ప్రాంతం మణేసముద్రం, గోరంట్లరోడ్, కిరికెర, లేపాక్షి మండలం కోడిపల్లి, పులమతి పంచాయతీ, లేపాక్షిలో దాదాపు 30 వరకు అనధికారికంగా లేఅవుట్లు వెలిసినట్లు తెలిసింది. హిందూపురం పట్టణ పరిధి మోతుకపల్లి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా లేవుట్లు వేసి విక్రయిస్తున్నారని పురపాలక సంఘం కోఆప్షన్ సభ్యురాలు సువర్ణమ్మ ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె తెలిపారు. లేఅవుట్ వేయాలంటే ముందుగా వ్యవసాయ భూములను వాణిజ్య భూములుగా మార్చాలి. అనంతరం అహుడా నిబంధనల మేరకు రహదారులు, కాలువలు, విద్యుత్తు, నీటి సౌకర్యం, ఉద్యానవనం ఇలా అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాటు చేసి.. అనుమతి లభించిన తరవాత సిద్ధం చేయాలి. కానీ ఎలాంటి నిబంధనలు పాటించకుండా లేఅవుట్లు వేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా కొనుగోలుదారులకు భవిష్యత్తులో చిక్కులు ఎదురవుతాయి. పురపాలక, మండల పరిధిలో అనధికారికంగా ఎవరు లేవుట్లు వేసినా తగిన చర్యలు తీసుకొంటాం. అనుమతులు తీసుకోక అక్రమ లేఅవుట్లు వేస్తే వాటికి నోటీసులు అందించి నిలుపుదల చేస్తాం.

## హెచ్చరించినా.. సమ్మె కొనసాగిస్తాం
## స్పష్టం చేసిన అంగన్‌వాడీ సిబ్బంది



చిత్తూరు:డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది వెనక్కు తగ్గేదిలేదని స్పష్టం చేశారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీలు ససేమిరా అన్నారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా సీడీపీవో కార్యాలయాలు, మండల తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేశారు. వారికి తెదేపా, సీఐటీయూ, సీపీఐ, జనసేన నాయకులు సంఘీభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ క్రమంలోపంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోల ద్వారా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది వరకు కేంద్రాలకు ఉన్న తాళాలను ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ముందుగా అడిగారు. వారు ఇవ్వకపోవడంతో ఉన్న తాళాలు పగులగొట్టి కొత్త తాళాలు వేశారు. కేంద్రాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, మహిళా పోలీసులు, గ్రామ సమాఖ్య లీడర్లు(వీవోఏల) ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని నిర్ణయించి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. యథావిధిగా చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ చేయాలని నిర్ణయించారు. మరో వైపు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోగా, సమ్మెను పట్టించుకోకుండా తమను కాదని ప్రత్యామ్నాయ మార్గాల్లో కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వం నియంతలా వ్యవహరించడం దారుణమని, తమ డిమాండ్లపై స్పందించకుండా కేంద్రాలను నిర్వహిస్తే అడ్డుకుంటామని అంగన్‌వాడీ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించింది. అయినా వారు వినకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ద్వారా గురువారం అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నాం.

## తెలంగాణ గజగజ

హైదరాబాద్: తెలంగాణలో చలి రోజురోజుకు పెరిగిపోతోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. ఇక పొగమంచు ఉదయం 10 గంటలైనా వీడటం లేదు. రహదారులను మంచు దుప్పటి కప్పడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం బడులకు, కాలేజులకు వెళ్లే పిల్లలు, ఇతర పనుల మీద బయటకు వెళ్లే పెద్దవారు చలికి వణుకుతున్నారు.

మరి చిన్న పిల్లలైతే ఉదయాన్నే చలిలో పాఠశాలకు వెళ్లేందుకు గజగజ వణికిపోతున్నారు.

మరోవైపు రాష్ట్రంలోని 7 జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో చలి తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌తోపాటు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించారు. శనివారం రాత్రి రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 10.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా పలు జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా సోనాలలో 10.7, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 11.2, నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో 11.7, సంగారెడ్డి జిల్లా ఆల్మాయ్‌పేటలో 12.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు.

# భారీగా తగ్గిన ధాన్యం కొనుగోళ్లు.. రికార్డు స్థాయిలో వరిసాగైనా నామమాత్రంగానే సేకరణ

**ఇప్పటివరకు 44 లక్షల టన్నులు పూర్తి**
**మరో ఐదారు లక్షల టన్నులు వచ్చే అవకాశం**
**ఈసారి 50 లక్షల టన్నుల లోపేనని అంచనా**
**నిరుడు 64 లక్షల టన్నుల వద్ద కొనుగోలు**
**ఎక్కువభాగం కొనేసిన మిల్లర్లు, వ్యాపారులు**



హైదరాబాద్: రాష్ట్రంలో వానకాలం సీజన్ (2023-24) ధాన్యం కొనుగోళ్లు భారీగా తగ్గాయి. ఈ సీజన్‌లో పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు 44 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. నిరుడు ఇదే సమయానికి సుమారు 60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, సీజన్ ముగిసేనాటికి 64.30 లక్షల టన్నులు కొనుగోలు చేయడం విశేషం. రాబోయే రోజుల్లో మరో 5 లక్షల టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. దీంతో ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు 50 లక్షల టన్నులకే పరిమితం అవుతాయనే అంచనాలు ఉన్నాయి. గత సంవత్సరంతో పోల్చుకంటే ఈసారి ధాన్యం కొనుగోళ్లు దాదాపు 14-15 లక్షల టన్నులు తక్కువగా ఉంటాయని భావిస్తున్నారు. ఈ ఏడాది ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు అధికమొత్తంలో ధాన్యం కొనుగోలు చే యడమే ఇందుకు కారణమని పౌరసరఫరాల శాఖ అధికారులు భావిస్తున్నారు. అక్టోబర్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించిన పౌరసరఫరాల సంస్థ.. ఇప్పటివరకు ఎనిమిది లక్షల మంది రైతుల నుంచి సుమారు రూ. 9,500 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇప్పటికే రూ.8,500 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయగా మరో రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం.

**రికార్డు వరి సాగు.. అయినా తగ్గిన కొనుగోళ్లు**

వాస్తవానికి ఈ వానకాలంలో ఆల్‌టైం రికార్డు స్థాయిలో వరి సాగైంది. 65 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. దీంతో సుమారు 1.4 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో సగం ధాన్యం మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తారని, మరికొంత ధాన్యాన్ని రైతులు తమ వద్దే నిల్వ చేసుకుంటారని భావించిన పౌరసరఫరాల సంస్థ.. దాదాపు 70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందని అంచనా వేసింది. కానీ ఇందుకు విరుద్ధంగా ఇది 50 లక్షల టన్నుల వద్దే ఆగిపోతుండటం గమనార్హం.

**మిల్లర్ల కొనుగోలు జోరు**

ఈ సీజన్‌లో ఉత్పత్తి అయిన ధాన్యంలో ఎక్కువ భాగాన్ని మిల్లర్లు కొనుగోలుచేసినట్టు తెలుస్తున్నది. సాధారణంగా వానకాలం సీజన్‌లో దాదాపు 40 లక్షల టన్నుల వరకు మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులే కొనుగోలు చేస్తుంటారు. ఈసారి దాదాపు 70 లక్షల టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేసినట్టు సమాచారం. దీని వెనుక ఆసక్తికర కారణం కనిపిస్తున్నది. గతంలో పౌరసరఫరాల సంస్థ సీఎమ్మార్ కోసం ఇచ్చిన ధాన్యంలో సుమారు 30 లక్షల టన్నులు మిల్లర్ల వద్దే ఉన్నది. ఈ ధాన్యాన్ని మిల్లర్లు సొంత అవసరాలకు వినియోగించుకున్నట్టు తెలిసింది. దీంతో ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎమ్మార్‌ను సమకూర్చేందుకు రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసినట్టు సమాచారం. ఒకవేళ ఇప్పుడు కొనుగోలు చేయలేని పక్షంలో ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నదనే గ్రహింపుతో మిల్లర్లు పోటీపడి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారని భావిస్తున్నారు.

**వరి సాగు విస్తీర్ణం 65 లక్షల ఎకరాలు**

ఉత్పత్తి అంచనా 1.4 కోట్ల టన్నులు
ఇప్పటివరకు కొనుగోలు చేసింది 44 లక్షల టన్నులునిరుడు ఇదే సమయానికి 60 లక్షల టన్నులు
కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 9,500 కోట్లు
రైతులకు చెల్లించిన మొత్తం రూ. 8,500 కోట్లు
పెండింగ్ బిల్లులు రూ. 1,000 కోట్లు

# నాంపల్లి నుమాయిష్ 2024 ప్రారంభించిన సీఎం రేవంత్.. సందర్శకులకు మాస్క్ కంపల్సరీ!



హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నుమాయిష్ సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు(నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు కూడా) పాల్గొన్నారు.

ఈసారి కూడా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు నుమాయిష్ 2024 జరగనుంది. నుమాయిష్ కోసం ఈసారి 2,400 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇక తెలంగాణలో కరోనా కేసులు కలవర పెడుతున్నాయి. నుమాయిష్‌కు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో.. మాస్కులు కచ్చితంగా ధరించి రావాలంటూ సందర్శకులను కోరుతున్నారు నిర్వాహకులు. ఈసారి నుమాయిష్ నేపథ్యంలో నగరంలో 45 రోజుల పాటు ఆ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. మరోవైపు సర్వీసులను ఎక్కువ సమయం నడిపేందుకు హైదరాబాద్ మెట్రో సిద్ధమైంది. ఇక మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణాల నేపథ్యంలోనూ నాంపల్లి రూట్‌లో బస్సులకు ప్రయాణికుల తాకిడి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

నుమాయిష్‌కు టికెట్ ధరలు గతంలో మాదిరే ఉండనున్నాయి. గతేడాది 10 రూపాయలు పెంచి నుమాయిష్ టికెట్ ధర రూ.40గా నిర్ణయించారు. ఇప్పుడు కూడా టికెట్ ధర రూ.40 లుగా కొనసాగించనున్నారు. నుమాయిష్ సాధారణ రోజులలో సాయంత్రం 4 నుంచి రాత్రి 10.30 వరకు కొనసాగుతోంది. వీకెండ్స్,సెలవు దినాల్లో మాత్రం సాయంత్రం 4 నుండి రాత్రి 11 గంటల వరకు నుమాయిష్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ఈ సంవత్సరం నుమాయిష్ సందర్శన వేళలను నిర్వాహకులు పొడిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నుమాయిష్ ను సందర్శించేందుకు మహిళలు, పిల్లలకు ప్రత్యేకంగా ఒక్కో రోజు కేటాయించనున్నారు. జనవరి 9న 'లేడీస్ డే' పేరుతో మహిళలను, 31న 'చిల్డ్రన్ స్పెషల్' పేరుతో పిల్లలను నుమాయిష్ ను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తామని నిర్వహకులు తెలిపారు. నుమాయిష్ నిర్వహణ ద్వారా ప్రతీ ఏడాది సుమారు రెండు వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించడంతోపాటు సుమారు 30 వేల మంది విద్యార్థులకు విద్యావకాశం కల్పిస్తోంది నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ.

# జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు

జపాన్ : జపాన్ లో భారీ భూకంపం సంభవించింది. ఇషికావా రాష్ట్రంలో సోమవారం ఉదయం భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 7.4గా నమోదైనట్లు జపాన్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

భారీ భూప్రకంపనల ధాటికి జపాన్ రాధాని టోక్యో, కాంటో ప్రాంతాల్లోనూ భూమి కంపించినట్లు జపాన్ టైమ్స్ వెల్లడించింది. అయితే, ఈ భూప్రకంపనల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. మరోవైపు భారీ భూకంపం నేపథ్యంలో జపాన్ ప్రభుత్వం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. 5 మీటర్ల ఎత్తులో అలలు ఎగసిపడే అవకాశం ఉందని.. ముందు జాగ్రత్తగా ప్రజలు వెంటనే తీర ప్రాంతాలను వదిలి వెళ్లాలని ఆదేశించింది.

మరోవైపు భూమి ఒక్కసారిగా కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూ ప్రకంపనలకు బిల్డింగులు ఊగిపోయాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలను జపాన్ వాసులు తమ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ వీడియోలు వైరల్ అవుతున్నాయి.

# కిట్లకూ మంగళం.. పేరు మారిన కేసీఆర్ కిట్, నిలిచిన న్యూట్రిషన్ కిట్ కొనుగోళ్లు

**ప్రశ్నగా మారుతున్న 'పోషకాహారం'**
**అయిపోయిన న్యూట్రిషన్ కిట్ నిల్వలు**
**నిలిచిపోయిన ప్రభుత్వ కొనుగోళ్లు**
**ఎంసీహెచ్ కిట్‌గా పేరు మారిన కేసీఆర్ కిట్**
**ఆర్థిక సాయంపై కొరవడిన స్పష్టత**




హైదరాబాద్: గర్భిణులు ఆరోగ్యంగా ఉంటూ, కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతూ సురక్షిత ప్రసవం అయ్యేందుకు సహాయం చేస్తున్న 'కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్'లను కొనసాగిస్తారా? లేదా? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే కేసీఆర్ కిట్ పేరును 'ఎంసీహెచ్ కిట్'గా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. అయితే కేసీఆర్ కిట్‌తో ఉన్న ఆర్థిక సాయాన్ని కొనసాగిస్తారా? లేదా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు.

గతంలో గర్భిణిగా పేరు నమోదైనప్పటి నుంచి ప్రసవం అయ్యి, పిల్లలకు వ్యాక్సిన్లు పూర్తయ్యే నాటికి గర్భిణులకు ప్రభుత్వం రూ.12 వేలు ఆర్థిక సాయం అందించేది. అమ్మాయి పుడితే మరో రూ.1000 అదనంగా ఇచ్చేది. దీంతోపాటు తల్లికి, బిడ్డకు కావాల్సిన నిత్యావసరాలతో కూడిన కిట్ అందించేంది. దీని ఖరీదు దాదాపు రూ.2 వేలు. ఇలా సుమారు 13 లక్షల మంది గర్భిణులకు కేసీఆర్ పాలనలో ఆర్థిక సహాయం అందింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పేరును 'ఎంసీహెచ్ కిట్'గా పేరు మార్చింది. అయితే రూ.13 వేల ఆర్థిక సాయం, రూ.2 వేలు విలువైన వస్తువుల కిట్‌ను కొనసాగిస్తారా? లేదా? అన్నదానిపై స్పష్టత లేదు. ఇప్పటికైతే గర్భిణుల పేర్లు నమోదు చేస్తున్నామని, ఆర్థిక సాయం ఎంత అనేదానిపై ఇంకా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెప్తున్నారు. కేంద్రం ఇచ్చే రూ.5 వేల సాయంతో సరిపెడతారని కొందరు చెప్తుండగా, పేరు మార్చి కొనసాగిస్తారని మరికొందరు పేర్కొంటున్నారు.

**అయిపోయిన కిట్లు**

గర్భిణులను పోషకాహార లోపం, రక్త హీనత నుంచి కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ పథకానికి గతంలో రూపకల్పన చేసింది. రక్తహీనత అధికంగా నమోదైన 9 జిల్లాల్లో మొదటి దశ కింద 2022, డిసెంబర్ 21వ తేదీన పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో సుమారు 1.25 లక్షల మంది గర్భిణులకు ఈ కిట్లను పంపిణీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.50 కోట్లు ఖర్చు చేసింది. అక్కడ మంచి ఫలితాలు రావడంతో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గత ఏడాది జూన్ 14 నుంచి మిగతా 24 జిల్లాల్లోనూ కిట్లు పంపిణీని నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ కిట్‌లో 8 రకాల వస్తువులుంటాయి. కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూరం, మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు, అరకిలో నెయ్యి, 200 గ్రాముల పల్లిపట్టి, ఒక కప్పు, ప్లాస్టిక్ బాటిల్ ఉంటాయి.

ప్రతి గర్భిణీకి రెండు కిట్లు అందజేస్తారు. 13-27 వారాల మధ్య జరిగే రెండో ఏఎన్‌సీ చెకప్ సమయంలో ఒకసారి, 28-34 వారాల మధ్య నిర్వహించే మూడో ఏఎన్సీ చెకప్ సమయంలో రెండోసారి ఈ కిట్‌ను ఇస్తారు. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.2 వేలు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.8 లక్షల మంది గర్భిణులకు ప్రయోజనం కలుగనున్నది. ఇందుకోసం బడ్జెట్లో రూ.250 కోట్లు కేటాయించారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ నిలిచిపోయింది. గతంలో కొనుగోలు చేసిన కిట్ల నిల్వలు అయిపోయాయి. కొత్తగా కొనుగోళ్లపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదని అధికారులు చెప్తున్నారు. పథకాన్ని నిలిపివేస్తారో, కొత్త పేరుతో కొనసాగిస్తారో తెలియడం లేదని చెప్తున్నారు. దీంతో వేలమంది గర్భిణులకు కిట్స్ పంపిణీ ఆగిపోయిందని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కిట్స్ కొనుగోలుకు చొరవ చూపాలని కోరుతున్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో రూ.2.9కోట్ల విలువైన బంగారం పట్టివేత



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో హోంమంత్రిగా మహమూద్ అలీ కొనసాగారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖను ఎవ్వరికీ ఇవ్వకుండా తన వద్దనే ఉంచుకున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించడంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టి ప్రతీ రోజూ డ్రగ్స్ ముఠాను అరెస్ట్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. త్జాజాగా శంషాబాద్లోని రాజీవ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. విమానాల్లో దుబాయి నుంచి వ్యక్తిన నలుగురి నుంచి ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు మహిళల వద్ద 1865.2 గ్రాముల బంగారాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బంగారం రూ.1.18కోట్ల విలువ ఉంటుందని పేర్కొన్నారు. 16 బంగారు బిస్కెట్లను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో వ్యక్తి నుంచి 1,100 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ చెప్పింది. ఈ బంగారం విలువ రూ.69.85లక్షలు ఉంటుందని చెప్పింది. ఈ నెల 30న మహిళ నుంచి 1,632 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని దాని విలువ రూ.1.03కోట్ల ఉంటుందని కస్టమ్స్ వివరించింది.

# వీణవంక తహసీల్ కార్యాలయంలో దొంగతనం

**- ఉన్నతాధికారులకు, పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు**



వీణవంక: ఆయనో మండల మెజిస్ట్రేట్.. మండలం మొత్తం ఆయన చేతుల్లోనే ఉంటుంది. ఏ చిన్న విషయం నుండి మొదలు మండలం మొత్తం భూమి, సర్టిఫికెట్లు ఇతరత్రా పనులు ఆయనే చేయాల్సి ఉంటుంది. ఆయనకు వచ్చే ప్రతీ దరఖాస్తు స్వయంగా పరిశీలించిన తర్వాతే ఆయన డిజిటల్ సైన్ చేసి సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఆయన ప్రమేయం లేకుండా మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో డిజిటల్ సైన్ వేరే ఉద్యోగులు వేసి సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిసింది. దీంతో తహసీల్దార్ స్థానిక పోలీసు స్టేషన్ తో పాటు కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఒక్క డిజిటల్ సైన్ దొంగిలించి సర్టిఫికెట్ జారీ చేశారా.. లేక మరెన్ని అర్హత లేని సర్టిఫికెట్లు జారీ అయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది.

**డిజిటల్ సంతకం దోపిడీ**

వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో నిత్యం అవినీతి జరుగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఏకంగా ధరణిలో అధికారుల చేతివాటం అంటూ రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఓ యువ రైతు అప్పని హరీష్ వర్మ ఏకంగా అడిషనల్ కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. అప్పుడు అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపి ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించి దాన్ని అంతటితోనే ఆపేశారు. అప్పుడు కేవలం డబ్బులు చేతిమార్పిడే అని అనుకున్నారు. కానీ నేడు డిజిటల్ సంతకాన్నే ఏకంగా దోపిడి చేసి చీటింగి పాల్పడే స్థాయికి అధికారులు దిగజారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన ఓ కుటుంబ పెద్ద చనిపోగా ఆ కుటుంబంలోని వ్యక్తులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నవంబర్ నెలలో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే స్థానిక తహసీల్దార్ తిరుమల్ రావు విచారణ జరిపి ఆ దరఖాస్తును ఫెండింగ్లో ఉంచారు. అయితే మరి కొద్ది రోజులకు ఆ కుటుంబం తహసీల్దార్ కార్యాలయానికి తిరిగితిరిగి కార్యాలయంలోని కింది స్థాయి ఉద్యోగులను కలిసి ఎంతో కొంత నగదు ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీంతో సదరు ఉద్యోగులు తహసీల్దార్ లేని సమయంలో తహసీల్దార్ డిజిటల్ సంతకాన్ని దొంగతనం చేసి పెద్ద సార్ గుర్తు పట్టడేమోనని భావించి ఏకంగా కుదుర్చుకున్న మొత్తాన్ని తీసుకుని సర్టిఫికెట్ ను జారీ చేశారు. దీంతో కొద్ది రోజులకు ఆ విషయాన్ని తహసీల్దార్ తిరుమల్ రావు గుర్తించి కింది స్థాయిలో విచారణ జరిపారు. అయితే ధరణి ఆపరేటర్ అరుణ్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఈ కుట్రలో పాలు పంచుకుని తనను చీటింగ్ చేశారని భావించి స్థానిక పోలీస్ స్టేషన్, ఆర్డీవో రాజు, కలెక్టర్ ప్రమేల సత్పతికి ఫిర్యాదు చేశారు. ఈ ఇద్దరిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కోరుతున్నారు.

**తహసీల్దార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది..**

తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ ఫైల్ ముందుకు కదలాలంటే అమ్యామ్యాలు ముట్టందే ఫైల్ ముందుకు కదలదనే ఆరోపణలు ఉన్నాయి. కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు రెవెన్యూ కార్యాలయం ద్వారా ఇచ్చే ప్రతీ సర్టిఫికెట్ కు డబ్బులు ఇవ్వందే వచ్చేది లేదనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక రైతులకు భూమిని ట్రాన్సఫర్ చేసేందుకు గత ప్రభుత్వం ధరణి అనే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి దానిని పర్యవేక్షించేందుకు తహసీల్దార్తో పాటు అతడికి సహకరించేందుకు ఓ ప్రత్యేక ఆపరేటర్ను సైతం ఏర్పాటు చేసింది. అయితే దీంతో ఆ ఆపరేటర్ ను అధికారులు నమ్ముతూ అతడి వద్దే డిజిటల్ కీ ని ఉంచి పనులను పూర్తి చేస్తున్నారు. దీంతో ఆ ఆపరేటర్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తూ దొంగ సర్టిఫికెట్ల జారీ వరకూ అమ్యామ్యాలు ముట్టందే ఫైలు ముందుకు కదలడం లేదనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఆ ఆపరేటర్లు చేసిన సంఘటనలే అధికారుల్లో పంపకాలల్లో తేడా ఉండడంతో వారి మధ్య గ్యాప్ పెంచుతున్నాయనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# దుబ్బాకను అభివృద్ధి చేసిన ఘనత ముత్యంరెడ్డి. కె దక్కుతుంది



తొగుట: దుబ్బాకను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచిన ఘనత ముత్యం రెడ్డి కె దక్కుతుందని ఆయన సతీమణి చెరుకు విజయమ్మ,మండల అధ్యక్షుడు అక్కం స్వామి అన్నారు. మండలం లోని తుక్కాపూర్ ఎక్స్ రోడ్ వద్ద స్వర్గీయ మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి 79 వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లా డుతూ స్వర్గీయ చెరుకు ముత్యం రెడ్డి దుబ్బాక నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, మంత్రిగా, అంచనాల కమిటీ చైర్మన్ గా, టీటీడీ బోర్డు మెంబర్ గా ఉన్న సమయం లో దుబ్బాకను అన్ని రంగాలలో అభి వృద్ధి చేశారని పేర్కొన్నారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీల లో ఉంది దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత ముత్యం రెడ్డి దక్కుతుందని అన్నారు. ముత్యం రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్ప టికీ మర్చిపోరని, దుబ్బాక ప్రజల మనసులలో అభివృద్ధి ప్రదాతగా నిలిచిపోయారని కొనియాడారు.ఆయన చూపిన బాటలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, తొగుట సర్పంచ్ పాగాల కొండల్ రెడ్డి, టీపీసీసీ ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లింగా ల కృష్ణ, నాయకులు మహిపాల్ రెడ్డి, తుక్కాపూర్ గ్రామ అధ్యక్షుడు బర్రింకల స్వామి, సంతు,రాజు, కనికి స్వామి, గోపాల్, స్వామి, చిక్కుడు బాలమల్లు, బషీర్, రాములు, నాగరాజు, ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ బుర్ర నరసింహులు, రమేష్, నరసవ్వ, వివిధ గ్రామాలకు చెందిన అధ్యక్షులు, నాయకులు బుట్టి ప్రభాకర్, రామస్వామి, భరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరవు కాటేసింది.. ఆదుకోండి సారూ



పలమనేరు : కనీసం పెట్టుబడులూ దక్కలేదు. పశుగ్రాసం లేక మూగజీవాలు ఇబ్బందులు పడ్డాయి. చేసేది లేక వాటిని తెగనమ్ముకుని జీవనం సాగించాం. కరవు రైతుల జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. సాయం చేసి ఆదుకోవాలని పలువురు రైతులకు జిల్లాలో కరవు పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం ఎదుట మొర పెట్టుకున్నారు. జిల్లాలోని కరవు పరిస్థితిని అంచనా వేసేందుకు కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సభ్యుడు, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ పి. దేవేంద్రరావు నేతృత్వంలో కేంద్రం బృందం జేసీ శ్రీనివాసులతో కలిసి జిల్లాలో పర్యటించారు. ముందుగా పలమనేరు మండలం గుండ్లపల్లె, శ్రీరంగరాజపురం గ్రామాల్లో వేరుసెనగ పంట నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఆక్రందన అధికారుల ఎదుట వెలిబుచ్చారు. అనంతరం జేసీ మాట్లాడుతూ కరవు మండలాలుగా ప్రకటించిన పలమనేరు, రామకుప్పం, గంగవరం, రొంపిచెర్లలో భూగర్భ జలమట్టాలు, నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. దానికి అనుగుణంగా రైతులు పంటలు పండిస్తున్నారని చెప్పారు. జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 51,266 హెక్టార్లలో వేరుసెనగ సాధారణ సాగు లక్ష్యం కాగా కేవలం 15,038 హెక్టార్లలో సాగైందన్నారు. అందులోనూ చాలా మేర ఎండిపోయినట్లు గుర్తించామని బృందానికి వివరించారు. అనంతరం కేంద్ర బృంద సభ్యులు దేవేంద్రరావు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నివేదిక రూపంలో కేంద్రానికి అందజేస్తామన్నారు. రైతుల ఇబ్బందులు, పంట నష్టంపై సమగ్ర వివరాలు పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి ప్రసన్న, జిల్లా వ్యవసాయాధికారి మురళీధర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి శోభారాణి పాల్గొన్నారు.నాకున్న 2 ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశా. పెట్టుబడి రూ.70 వేలు వచ్చింది. అయితే దిగుబడులు రాకపోవడంతో కేవలం రూ.10 వేలు మాత్రమే చేతికి వచ్చింది. అప్పు తెచ్చి సాగు చేపట్టా. గతంలో దిగుబడిలో విత్తనం కోసం కొంత మేర దాచుకునే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. పరిహారంతో పాటు, రాయితీ విత్తనాలు అందించాలి.

# కడుపు మండుతుంటే కవ్వింపు చర్యలా?



కాకినాడ- న్యూస్‌టుడే బృందం: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు రోడ్డెక్కారు... సర్కారు పట్టించుకోవడంలేదనికడుపు మండి మూడు రోజులుగా సమ్మెచేస్తున్నారు.. పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం ప్రత్యామ్నాయం పేరు చెప్పి రెవెన్యూ, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బందిని రంగంలోకి దింపేసింది. తాళాలు పగలగొట్టించి మరీ కేంద్రాలు తెరిపించింది.. సుత్తులు, బండరాళ్లు, గునపాలతో వీరు రావడం చూసి నివ్వెరపోవడం స్థానికుల వంతయింది. కొన్నికేంద్రాల వద్ద వైకాపా నాయకులు దగ్గరుండి మరీ తాళాలు బద్దలుకొట్టడం విమర్శలకు తావిచ్చింది. సమ్మెపై ఉక్కుపాదం మోపినా ఆందోళన విరమించేదిలేదని అంగన్‌వాడీ సిబ్బంది స్పష్టంచేశారు. కలెక్టరేట్, ఐసీడీఎస్ పీడీ, తహసీల్దారు కార్యాలయాల ఎదుట దీక్షలు కొనసాగాయి. వీరికి తెదేపా, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. మరికొన్నిచోట్ల చిన్నారుల తల్లులు సైతం సంఘీభావం పలికారు. ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ, ఐసీడీఎస్, మున్సిపల్, గ్రామ- వార్డు సచివాలయ సిబ్బంది శుక్రవారం తాళాలు పగలగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు తెదేపా, జనసేన నాయకులు ప్రతిఘటించారు.. సమ్మె విఫలం చేయడానికి వైకాపా నాయకులను, కీలక శాఖలను ప్రభుత్వం రంగంలోకి దింపడంపై అభ్యంతరం వ్యక్తమైంది. తాము అద్దెకిచ్చిన భవనాల తాళాలను పగలగొట్టడం ఏమిటని యజమానులు సైతం నిలదీశారు. తాళ్లరేవు మండలం కోరింగ పంచాయతీ సీతారామపురంలో పంచాయతీ కార్యదర్శి రామరాజు, వైకాపా నాయకులు పెయ్యల శ్రీనివాస్, పెసింగి వర్మ సమక్షంలో ప్రైవేటు వ్యక్తితో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టించారు. మాధవరాయునిపేటలో వైకాపా నాయకుడు ఎన్.శ్రీమన్నారాయణ దగ్గరుండి తాళం పగలగొట్టించి తెరిపించారు. జి.వేమవరంలో వైకాపా నాయకులు ఎన్.శ్రీనివాసరావు, మట్టా లింగమూర్తి కేంద్రం తెరిపించారు.నీ అమలాపురం మార్కెట్ వీధిలో వైకాపా కౌన్సిలర్ బండారు గోవింద్ స్వయంగా కేంద్రం తాళాలు పగలగొట్టారు.

# ఈఎస్ఐకి సామగ్రి సరఫరా నిలిపివేత



రాజమహేంద్రవరం:కార్మికులకు ఉండేదే తక్కువ జీతాలు. ఆ మొత్తంతోనే కుటుంబాన్ని పోషించుకోవాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తితే బోలెడు ఖర్చు. వారికి వైద్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ ఆసుపత్రే ఆధారం. అలాంటి కీలకమైన రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రికి సుస్తీ చేసింది. అనారోగ్య సమస్యతో వెళ్తే, వ్యాధి నిర్ధారణ చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటోంది. సాధారణ బీపీ, మధుమేహం తదితర పరీక్షలు మినహాయిస్తే మిగిలిన వాటికి అవసరమైన రసాయనాలు మాత్రం నెలల తరబడి రావట్లేదు. సిరంజీలు, దూది, ఐవీ సెట్లు లేకపోవడం గమనార్హం. ఇదేమని ప్రశ్నిస్తే గుత్తేదారుకు బకాయిలు చెల్లించకపోవడంతో ఆపేశారని వైద్యాధికారులు చెబుతున్నారు. సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌కు విలువైన మందులు సరఫరా అవుతున్నా సిరంజీలు, సిలైన్స్, ఐవీ సెట్స్ లేవు. కొన్ని సందర్భాల్లో వైద్యులు కొంతమేర చందాలు వేసుకుని సమకూర్చుతున్నారు. లేకుంటే కార్మికులే కొనుగోలు చేసుకోవాలి. డ్రగ్ స్టోర్ నుంచి ఉభయగోదావరి జిల్లాకు ఆర్టీసీ ద్వారా మందులు సరఫరా చేయాల్సి ఉంది. రెండేళ్లుగా ఆ బిల్లులు చెల్లించకపోవడంతో దాదాపు రూ.7 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఆర్టీసీ ముందుకు రాకపోవడంతో ఆసుపత్రి అంబులెన్స్ వాహనాల్లో సరఫరా చేస్తున్నారు. ఆసుపత్రిలో సాధారణంగా 24 రకాల పరీక్షలకు అవకాశం ఉన్నా సాధారణ మినహా సగం మేర ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయట్లేదు. మలేరియా, డెంగీ, హెచ్ఐవీ, సీఆర్పీ, ఆర్ఏ, ఏఎస్‌వో, థైరాయిడ్ తదితర పరీక్షలు నెలల తరబడి జరగట్లేదు. సెల్‌కౌంట్‌కు సంబంధించిన రసాయనాలు సైతం తక్కువగా ఉన్నాయి. ప్రైవేటుగా చేయిస్తే రూ.100 నుంచి రూ.500 వరకు కార్మికులపై భారం పడుతోంది. గతంలో నెలకు సగటున మూడు వేల పరీక్షలు జరగ్గా, ప్రస్తుతం ఆ సంఖ్య 1,000 దాటట్లేదు. కొన్ని పరిశ్రమలు సామాజిక బాధ్యతతో రూ.లక్షల విలువైన యంత్ర సామగ్రి అందిస్తున్నారు. రసాయనాలు, సర్జికల్ సామగ్రి సరఫరా చేసే గుత్తేదారుకు సుమారు రూ.4 లక్షల బకాయిలు ఉండడంతో వాటి సరఫరా నిలిపేశారు. దీంతో విలువైన యంత్ర సామగ్రిని వినియోగించలేని పరిస్థితి.

# మిగ్‌జాం నష్టం రూ.246.52 కోట్లు



రాజమహేంద్రవరం: ఇటీవల సంభవించిన మిగ్‌జాం తుపాను జిల్లాను అతలాకుతలం చేసింది. ప్రజలకు అపార నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాలతో పలు గ్రామాలను ముంచింది. ఈదురుగాలులతో బీభత్సం సృష్టించింది. ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో మొత్తం రూ.246.52 కోట్ల మేర నష్టం సంభవించినట్లు అధికారులు అంచనా వేశారు. దీనిలో తాత్కాలిక నష్టం రూ.27.7 కోట్లుగా, శాశ్వత నష్టం రూ.219.44 కోట్లుగా అంచనా వేశారు. శాఖల వారీగా సంభవించిన నష్టాలపై అంచనా నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రకారం జిల్లాలోని 18 మండలాల్లో 98 గ్రామాలు ప్రభావితంకాగా 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 1,275 మంది తుపాను ప్రభావానికి గురయ్యారు. పట్టణాల్లో ఎక్కడా ముంపు లేదని నివేదికలో పేర్కొనడం గమనార్హం. ఆయా గ్రామాల్లో సహాయక చర్యల్లో భాగంగా 32 ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 576 ఆహార పొట్లాలు, 960 తాగునీటి ప్యాకెట్లు, 25.15 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. శాఖల వారీగా నష్టం వివరాలిలా ఉన్నాయి. మొత్తం 173 గృహాలు దెబ్బతిన్నాయి. వీటిలో పూర్తిగా దెబ్బతిన్న పక్కాఇల్లు ఒకటి, కచ్చాఇళ్లు 27 ఉన్నాయి. పాక్షికంగా దెబ్బతిన్నవి 83 ఉండగా వీటిలో గుడిసెలు 62, నీట మునిగినవి 1057, ఎక్కువ సమయం 24 గంటలకు పైగా ముంపులో ఉన్నవి 1057, వారం రోజుల కంటే ఎక్కువ కాలం ముంపులో ఉన్నవి 369 ఉన్నాయి. దెబ్బతిన్న ఇళ్ల మొత్తం అంచనా విలువ రూ.17.3 లక్షలుగా చూపారు. పశుసంవర్ధక: ఆవులు ఆరు, గొర్రెలు 5 మృతిచెందగా రూ.2.10 లక్షల నష్టం జరిగింది. పౌల్ట్రీ, పశువుల కొట్టాలు, పశువైద్యశాలకు ఎటువంటి నష్టం జరగలేదు. ఆర్అండ్‌బీ: భారీ వర్షాలకు 347.12 కిలోమీటర్ల మేర ఉపరితల రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక నష్టాలు రూ.11.19 కోట్లు, శాశ్వత నష్టాలు రూ.137.15 కోట్లు. పంచాయతీరాజ్: మొత్తం 224.08 కిలోమీటర్ల మేర 70 రోడ్లు దెబ్బతిన్నాయి. మూడు భవనాలు పాడయ్యాయి. శాఖాపరంగా తాత్కాలిక నష్టాలు రూ.1588.8 లక్షలు, శాశ్వత నష్టాలు రూ.7987.3 లక్షలు. పురపాలక: ఆయా పట్టణాల్లో 91 వీధి దీపాలు, ఒక భవనం దెబ్బతినగా మొత్తం రూ.1.36 కోట్ల నష్టం జరిగింది. మత్స్యశాఖ: దెబ్బతిన్న పడవలు, వలలు 9, పూర్తిగా దెబ్బతిని పాడైపోయిన పడవ ఒకటి, నష్టం జరిగిన చేపలు, రొయ్యల చెరువులు 12. మొత్తం మత్స్య సంపద నష్టం రూ.12.72 లక్షలు. విద్యుత్తు: 33 కేవీ ఫీడర్లు 46, 11 కేవీ ఫీడర్లు 238, సబ్‌స్టేషన్లు 46 తుపాను ప్రభావానికి గురయ్యాయి. 33 కేవీ స్తంభాలు 14, 11 కేవీ స్తంభాలు 111, ఎల్‌టీ స్తంభాలు 74 దెబ్బతిన్నాయి. మొత్తం శాఖాపరంగా రూ.73.8 లక్షలు నష్టం వాటిల్లింది. వ్యవసాయం: వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి మొత్తం 16352.37 హెక్టార్లలో వివిధ పంటలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. వీటిలో 14621.8 హెక్టార్లలో వ్యవసాయ, 1730.57 హెక్టార్లలో ఉద్యాన పంటలు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో నష్టంపై చేపట్టిన గణన చివరి దశకు వచ్చింది. ఈ జాబితాను ఈ నెల 18 నుంచి 23 వరకు ఆర్బీకేల వద్ద ప్రదర్శించి తుది జాబితాను 24న ప్రభుత్వానికి పంపించనున్నట్లు సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నారు.

# పని భారం.. అల్ప వేతనం ఆశాల నిరసన పర్వం



అమలాపురం:గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య సంరక్షణతోపాటు అందరూ ఆరోగ్యంగా ఉండాలని అహర్నిశలు కష్టపడుతూ ఇంటింటికీ వెళ్లి నవ్వుతూ పలకరించే ఆశా కార్యకర్తలు పోరుబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించకుండా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని నిరసిస్తూ ఆశాలు మహాధర్నా, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమలాపురంలోని కలెక్టరేట్ ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా నలుమూలల నుంచి సుమారు వెయ్యిమంది ఆశా కార్యకర్తలు కదం తొక్కారు. ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాలు చెప్పినట్లు తమకు కనీస వేతనం కూడా చెల్లించడం లేదని వాపోతున్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పని భారం పెంచిందన్నారు. రూ.10 వేలు ఇస్తున్నామనే పేరుతో 24 గంటలు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వైద్యారోగ్య సిబ్బంది చేయాల్సిన అనేక రకాల పనులు తమతోనే చేయిస్తున్నారని బాధపడుతున్నారు. శిక్షణ ఇవ్వకుండా 14 రకాల యాప్‌ల ద్వారా పనిచేయిస్తున్నారన్నారు. ఫోన్లు పనిచేయకపోతే కొత్తవి కొనుక్కుని పనిచేయాలని, లేదంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని, 26 రకాల రికార్డులు రాయాలని హింసిస్తున్నారని, ఎన్‌హెచ్ఎం నిబంధనలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందని వాపోయారు. ఒత్తిడి తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురవుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకపోవడంతోనే తమ సమస్యలపై పోరుకు సిద్ధమయ్యామని తెలిపారు. కలెక్టరేట్ వద్ద రహదారిపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గేది లేదని, భారీఎత్తున పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కె.కృష్ణవేణి, దుర్గాప్రసాద్, ఎన్.బలరాం, బి.ఎస్తేర్‌రాణి, సూర్యవతి, సీత, వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి. పనిభారం తగ్గించాలి. రికార్డులు, ఆన్‌లైన్ ఏదో ఒకటే పనిచేయించాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. కరోనా కాలంలో మరణించిన ఆశాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి. ఏ కారణంతోనైనా ఆశావర్కరు మరణించినా రూ.10 లక్షల గ్రూపు బీమా వర్తింపజేయాలి. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు రూ.5 లక్షలు ఇవ్వాలి. 62 ఏళ్ల ఉద్యోగ విరమణ జీవోను వర్తింపజేయాలి.

# రెచ్చిపోతున్న భూబకాసురులు



జగ్గంపేట,:సీలింగ్, మిగులు భూములు ఎక్కడికక్కడ కబ్జాకు గురవుతున్నాయి. వీటికి సంబంధించిన దస్త్రాలను సైతం కొందరు పెద్దలు తారుమారు చేస్తున్నారు. ఎకరం సుమారు రూ.40 లక్షలు పలికే సీలింగ్, మిగులు భూములను ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో దర్జాగా సాగు చేసుకుంటున్నారు. రాజపూడి, గుర్రంపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు ఏడు ఎకరాల సీలింగ్ భూములు భూస్వాముల స్వాధీనంలో ఉన్నాయి. 270/2ఎలో సుమారు 10.30 ఎకరాలు ఉండగా నాలుగేళ్ల క్రితం గుర్రంపాలెం గ్రామంలో తప్పుడు పత్రాలు సృష్టించి 2.50 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మరో రెండు ఎకరాల సీలింగ్ భూమిని ఆక్రమించుకుని ఆయిల్‌పాం తోటలు వేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. బడా భూస్వామి ఆక్రమించుకున్న భూమిని ఆనుకుని ఉన్న 6.63 ఎకరాల సీలింగ్ భూమిని తృణమో ఫణమో ఇచ్చి రాయించేందుకు ప్రయత్నాలు జోరుగా చేస్తున్నట్లు తెలుస్తోంది. గుర్రంపాలెం శివారు బలభద్రపురం గ్రామ రెవెన్యూ పరిధిలో 270/2ఎలో ఉన్న మరో 6.63 ఎకరాల కోసం వైకాపాకు చెందిన నాయకులు ఎర వేస్తున్నారు. ఈ భూములను 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న దళితులు, బీసీలను పక్కన పెట్టి అధికార పార్టీకి చెందిన సర్పంచి తనయుడితో సహా మరో 8 మంది పార్టీ కార్యకర్తలకు పట్టాలు మంజూరు చేసేందుకు పంచాయతీలో తీర్మానం చేసి తహసీల్దారు కార్యాలయానికి పంపించారు. రెవెన్యూ అధికారులు 16 మందికి పట్టాలు మంజూరుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. 16 మంది లబ్ధిదారుల్లో ఏడుగురు మాత్రమే సాగుదారులు ఉండగా మిగిలినవి అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులే ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై 16 రోజులుగా సాగుదారులు ఆందోళనబాట పట్టడంతో ఆర్డీవో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సీలింగ్ భూములను పార్టీ నాయకులకు కట్టబెట్టే యత్నంతో ఎమ్మెల్యే చంటిబాబు పాత్ర ప్రధానంగా ఉందని సాగుదారులు ఈ సందర్భంగా ఆరోపిస్తున్నారు.

# విద్యుత్తు పొదుపు పాటిద్దాం



రాజమహేంద్రవరం: ప్రతిఒక్కరూ విద్యుత్తు వినియోగంలో పొదుపు పాటించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జేసీ తేజ్‌భరత్ సూచించారు. విద్యుత్తు పొదుపుపై గృహాలు, పరిశ్రమలు, వ్యాపార సముదాయాల ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జాతీయ విద్యుత్తు పొదుపు వారోత్సవాలు, అవగాహన ర్యాలీని జెండాఊపి ఆయన ప్రారంభించారు. గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు చర్యలు పాటించడం ద్వారా బొగ్గు, గ్యాస్, క్రూడ్‌ఆయిల్ వంటి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ టి.ఇ.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ఈ వారోత్సవాలను ఈ నెల 20 వరకు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు ర్యాలీ నిర్వహించామని, మిగిలిన రోజుల్లో 'విద్యుత్తు పొదుపు- ప్రాముఖ్యత'పై అవగాహన సదస్సులు, విద్యార్థులకు పోటీలు, జానపద కళాప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఆర్డీవో చైత్రవర్షిణి, విద్యుత్తుశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపరాదని, ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో నూరుశాతం సాధించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తేజ్‌భరత్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పశు సంవర్ధక, వ్యవసాయ, పౌరసరఫరాల తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని, తుపానుకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి గణన(ఎన్యుమరేషన్) త్వరగా పూర్తిచేసి తుది నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం రీసర్వేపై మండల స్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయసేందుకు తహసీల్దార్లు తమ పరిధిలోని సిబ్బందికి సరైన మార్గనిర్దేశం చేయాలన్నారు. సమ్మె కారణంగా జిల్లాలో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,541 కేంద్రాలు గురువారం తెరిపించామని, ఇంకా తెరుచుకోని 15 కేంద్రాల్లో పిల్లలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. 22,403 మంది రైతుల నుంచి మొత్తం 1,63,633.440 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 20,256 ఎఫ్‌టీవోలకు గాను రూ.212.42 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు.

# దళితుల భూముల్లో ఇసుక దోపిడీ



తాళ్లపూడి, న్యూస్‌టుడే: అక్రమార్కులు లంకభూములనూ వదలట్లేదు. తాతముత్తాల నుంచి సంక్రమించిన భూముల్లోకి చొరబడ్డారు. ఇటీవల ఓ గ్రామానికి చెందిన ప్రజలు అడ్డుకుంటే రెండురోజులు నిలిపేశారు. తాజాగా మరో వైపు నుంచి తవ్వి, తరలిస్తుండటంతో మరో గ్రామం ప్రజలు అడ్డుకున్నారు. ఇదంతా జరుగుతోంది.. హోంమంత్రి తానేటి వనిత నియోజకవర్గమైన తాళ్లపూడి మండలంలో. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లపూడి మండలం బల్లిపాడు, కొవ్వూరు మండలం చిడిపి సరిహద్దులో ఓపెన్‌ర్యాంపులో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఈనెల 12న చిడిపి గ్రామానికి చెందిన 97 మంది దళిత రైతులు వీటిని అడ్డుకున్నారు. తవ్వకాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మరోవైపు నుంచి తవ్వకాలు సాగిస్తుండటంతో తాళ్లపూడి మండలం వేగేశ్వరపురానికి చెందిన 54 మంది దళితులు తవ్వకాలు అడ్డుకుని రహదారిపై నిరసన చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకుని, ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటి వరకు తమభూముల్లో తవ్విన ఇసుకకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ది ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో ప్రభుత్వం సుమారు 54 మందికి 54 ఎకరాలు ఇచ్చిందని వారు చెబుతున్నారు. ఏటా ఈ భూములను ఆడిట్ చేయిస్తున్నామన్నారు. సంబంధిత పట్టాలు తమ వద్దే ఉన్నాయన్నారు. తాతముత్తాతల నుంచి వచ్చిన ఈ భూముల్లో అపరాలు, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసేవారమని, వరదల కారణంగా ఇసుక మేటలు వేసిందన్నారు. రాకపోకలకు కంకర రహదారిని నిర్మించారు. ఇసుక లారీలు దిగబడిపోకుండా ఉండేందుకు కొబ్బరి కొమ్మలను వేస్తున్నారు. నాలుగైదు ట్రాక్టర్ల కొబ్బరి కమ్మలను తెచ్చి దారి ఏర్పాటు చేస్తున్నారు.

# రాయితీలు లేక నేతన్న దిగాలు

మేడికొండూరు :మంగళగిరి, తెనాలి, పొన్నూరు, ఫిరంగిపురం మండలాల్లో విస్తరించి ఉన్న ఈ సంఘాలు వేల మందికి ఉపాధి కల్పించేవి. ప్రోత్సాహకాలు, రాయితీలు లేక ప్రభుత్వ సాయం అందక వాటి మనుగడ కష్టతరంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అయిదేళ్ల క్రితం 70 సంఘాలుండేవి. ప్రస్తుతం 28 మాత్రమే ఉన్నాయి. మిగిలినవన్నీ మూతపడ్డాయి. గతంలో కూలీలు 4,000 మంది పని చేసే వారు ప్రస్తుతం 500 మంది పనిచేస్తున్నారు. దీన్ని బట్టి సంఘాల దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. స్వాతంత్ర్యం రాక ముందే ఏర్పడిన ఈ సంఘాలు అప్పట్లో ఆర్థిక వనరులుగా పేరుగాంచాయి. వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణులు ఈ సంఘాల్లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఇప్పటికీ పొలం పనికి వెళ్లలేని వృద్ధులు, గృహిణులు సొసైటీల్లో పని చేస్తుంటారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న సంఘాల అభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్నేసింది. వైకాపా పాలనలోని ఈ నాలుగున్నరేళ్లలో యారం సబ్సిడీ, పావల వడ్డీ, రిబేట్, త్రిఫ్ట్ వంటి పథకాలు లబ్ధిదారులకు అందలేదు.

# ఇష్టారీతిన మట్టి తవ్వకాలు



సిరిసిల్ల:అడ్డగోలు తవ్వకాలు, అక్రమార్కుల బరితెగింపుతో కొండలు కరిగిపోతున్నాయి. ఖబ్రస్థాన్, డంపింగ్ యార్డు ఇలా దేనినీ వదలడం లేదు. ఇంత జరుగుతున్నా ఇదేమిటని అడిగే పరిస్థితే కనిపించడం లేదు. నిబంధనలు పక్కన పెట్టి, ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఇదంతా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోనే జరుగుతున్నా పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదు. సిరిసిల్ల పట్టణ శివారు రగుడులో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని గుట్టలను తొలచివేస్తున్నారు. దీనికి సమీపంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన డంపింగ్‌యార్డు, వీధి కుక్కల సంరక్షణ కేంద్రం, ముస్లింల ఖబ్రస్థాన్ ఉంది. అయినా అక్రమార్కులకు అవేమీ పట్టడం లేదు. యంత్రాలతో గుట్టను గుల్ల చేస్తున్నారు. పగలు తవ్వకాలు జరుపుతుంటే స్థానికులు కొందరు అడ్డుకోవడంతో మిన్నకుండిపోయారు. ప్రస్తుతం ప్రభుత్వ సెలవు రోజులు, రాత్రిళ్లు తవ్వకాలు సాగిస్తున్నారు. పచ్చని కొండ ప్రాంతం నేడు రాళ్లతో గోతులమయమైంది. మట్టిని తరలించడానికి విధిగా రెవెన్యూ, గనులు, భూగర్భశాఖల అధికారుల అనుమతి అవసరం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ప్రభుత్వం మట్టి క్వారీలకు అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వం అనుమతి లేకపోయినా, బహిరంగంగా తరలిస్తున్నారు. ప్రభుత్వ నిర్మాణాలకు, స్థానిక అవసరాలకు అధికారుల అనుమతితో వేబిల్లులు చెల్లిస్తే పర్వాలేదు. ఇక్కడ తవ్విన మట్టిని స్థిరాస్తి వ్యాపారులకు, స్థానిక అవసరాలకు లెక్కలు కట్టి విక్రయిస్తున్నారు. ఇదే అనుమతి తీసుకుని నిర్వహిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారి సమీపంలో తవ్వుతున్న మట్టిని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేసే వెంచర్లకు తరలిస్తున్నారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరం నుంచే మట్టిని తరలిస్తున్నా ఇప్పటికీ పురపాలక, రెవెన్యూ అధికారులు ఇక్కడికి వెళ్లి పరిశీలించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ పనులకైనా మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. జిల్లా వ్యాప్తంగా మట్టి తవ్వకాలకు ఎక్కడా అనుమతి లేదు. రెవెన్యూ అధికారులు అనుమతి ఇస్తే పరిశీలించి వేబిల్లులు జారీ చేస్తాం. రగుడు సమీపంలోనూ మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు.

# పులుపున్నా.. కాసుల పిలుపు లేకపాయె..!




నడిగూడెం:కిలో ధర రూ.15కు పడిపోవడంతో నిమ్మ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు నిమ్మకాయలకు ధర పడిపోవడం, మరో వైపు కాయలు కోసేందుకు కూలీల కొరతతో నిమ్మ సాగు చేసిన రైతులు నిలువునా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో మామిడి తర్వాత నిమ్మ తోటలు అధికంగా సాగులో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా నడిగూడెం మండలంలోనే ఐదు వేల ఎకరాల పైచిలుకు నిమ్మ తోటలు సాగులో ఉన్నాయి. ఆరుగాలం కష్టించి పంట చేతికొచ్చిన సమయంలో మార్కెట్‌లో ధర లేకపోవడంతో కొందరు రైతులు చెట్ల నుంచి కాయలు కోయక తోటలోనే నేల రాలిపోతున్నాయి. తోటలో నిమ్మకాయలు కోసి, మార్కెట్‌కు చేర్చేందుకయ్యే ఖర్చుల వరకు కూడా నిమ్మకాయలు విక్రయిస్తే రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ నెల మొదటి వారం వరకు కిలో రూ.30 పలికిన నిమ్మకాయల ధర గత వారం రోజుల నుంచి తగ్గుతూ వస్తున్నాయన్నారు. పది రోజుల వ్యవధిలోనే ధర సగానికి పడిపోవడంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నడిగూడెం పరిసర ప్రాంతాల్లో మార్కెటింగ్ అవకాశం లేకపోవడంతో విజయవాడ, హైదరాబాద్, నకిరేకల్ ప్రాంతాలకు నిమ్మకాయలను తరలించడం వల్ల రవాణా ఛార్జీలు, కమీషన్ ఖర్చులు అదనంగా అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. చెట్లపై కాయలు గుత్తులుగా ఉన్నప్పటికీ కోసేందుకు కూలీలు అందుబాటులో లేకపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడంతో రెండు విధాలా నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. తుపాను ప్రభావం కారణంగా నిమ్మ ధర సగానికి పడిపోయిందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దీనికి తోడు చలివాతావరణంతో నిమ్మ కాయలకు డిమాండ్ తగ్గడం కూడా కారణంగా పేర్కొంటున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఏటా పండ్ల తోటల రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జిల్లాలో నిమ్మ తోటల సాగు అధికంగా ఉన్నందున మార్కెట్‌లో ధర లేని సమయంలో నిమ్మ కాయలను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఈ ప్రాంతంలో నిమ్మ ఆధారిత పరిశ్రమ ఏర్పాటుపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలి. గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

# నిబంధనలకు నీళ్లు.. అక్రమ నిర్మాణాలు



నిర్మల్ :జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతోంది. పల్లె ప్రజలు పట్నం'దారి' పట్టడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. భవన నిర్మాణ అనుమతి విషయంలో ప్ర భుత్వం టీఎస్-బీపాస్ అమలులోకి తీసుకొచ్చినా.. అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఫిర్యాదులు వచ్చిన వాటిపై దృష్టి సారిస్తున్న 'పుర' అధికారులు మిగతా వాటిని పట్టించుకోవడం లేదు. ఇళ్ల అనుమతుల పరిశీలనకు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండటంతో ఈ అనుమతి లేని నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతుల నిబంధనలు కఠినతరం చేయ డంతో కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్ చేయడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకునేందుకు ముందుకురావడం లేదు. ఆదర్శ నగర్, సోఫీనగర్, రాంనగర్, అస్రానగర్, గాయత్రినగర్, ప్రియదర్శిని నగర్,శాస్త్రినగర్, విద్యానగర్, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తూ అడ్డగోలు నిర్మాణాలు చేస్తున్నారు. పట్టణ ప్రణాళికకు విరుద్ధంగా నిర్మిస్తున్నా అధికారులు చూస్తూ ఉండిపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం వందగజాల స్థలంలో నిర్మిస్తే పదిశాతం స్థలం మున్సి పాల్టీకి కేటాయించాలి. భవనాలకు సెట్‌బ్యాక్ ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. పట్టణాల్లో దుకాణ సముదాయాలన్నీ సెట్‌బ్యాక్ (ముందు కొంతస్థలం) లేకుండానే నిర్మిస్తున్నారు. భవనానికీ భవనానికి మధ్య మీటరు నుంచి మీటరున్నర వరకు ఖాళీస్థలం వదలాల్సి ఉండగా ఎవరూ దీనిని పాటించడం లేదు. బహుళ అంతస్తుల విషయంలోనూ జిల్లా ఏర్పడకముందు కేవలం పదిలోపు ఉంటే ఇప్పుడు 50కి పైగా ఉన్నాయి. 'పుర' అధికారుల లెక్కల ప్రకారం 35 వాటికి అనుమతులు ఉండగా.. మిగతావి అను మతులకు దరఖాస్తులు చేసుకున్నవే అయినా వాటి నిర్మాణాలు జరిగాయి. భవనం చుట్టూ అగ్నిమాపక వాహనం వెళ్లడానికి వీలుగా వీటిని నిర్మించాల్సి ఉన్నా.. ఇక్కడున్న వాటిల్లో ఖాళీ స్థలం వదలకపోవడంతో అగ్నిమాపక వాహనం వెళ్లదు. చాలా ప్రాంతాల్లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లకు వెళ్లే రహదారులపై ఒక ట్రాక్టరు వస్తే మరొకటి వెళ్లలేని పరిస్థితి. కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు తప్పుడు ధ్రువపత్రాలతో అనుమతులు తెచ్చుకున్నా అడ్డుకోవాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులు, 'పుర' అధికారులు పట్టించుకోవడంలేదు. పట్టణ శివారు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత బహుళ అంతస్తుల నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా చేపడ్తున్న విషయం అధికారులకు తెలిసినా ఆ నిర్మాణం రాజకీయ నేతది కావడంతో మిన్నకుండిపోయారు. మంచిర్యాలరోడ్‌లో రెండు బహుళ అంతస్తుల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినట్లు అధికారులు గుర్తించినా వాటిపైతీసుకోలే దు. నాలుగు అంతస్తుల వరకు అనుమతులు పొంది వేశారు. ప్రియ దర్శినినగర్, ఈద్గాం, ఆదర్శనగర్, దివ్యనగర్, శాంతిన గర్, విద్యా నగర్, మంజులాపూర్, విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతా ల్లోనూ అనుమతులుతీరు ఉంటే నిర్మాణాలు మరో తీరు చేపట్టారు. రెండతస్తుల నిర్మాణాలకు అనుమతులు తీసుకుని నాలుగైదు నిర్మించారు.

# గృహ నిర్మాణ శాఖకు పునరుజ్జీవం



మిర్యాలగూడ, :తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే సంకల్పంతో గృహనిర్మాణ శాఖను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది.దీంతో ఆ శాఖలో గతంలో పనిచేసిన ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బందిలో ఆశలు చిగురిస్తున్నాయి. 2014లో తెలంగాణలో తెరాస(భారాస) ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించి గృహనిర్మాణ శాఖను ఎత్తివేశారు. దీంతో ఆ శాఖలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులను ఇతర 12 ప్రభుత్వ శాఖల్లో ఇంజినీరింగ్ విభాగాల్లో సర్దుబాటు చేయగా, తాత్కాలిక సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. 2015లో తెలంగాణ ప్రభుత్వం రెండు పడకల ఇళ్ల పథకం ప్రారంభించటంతో పూర్తిగా గృహనిర్మాణ శాఖ ఇతర శాఖల్లో విలీనం చేశారు. 2018 తరువాత గృహ నిర్మాణ శాఖలో ఇంజినీర్లను రహదారులు భవనాల శాఖలోకి మార్పిడి చేశారు. ఉమ్మడి జిల్లాలో 59 మండలాల్లో గృహనిర్మాణ శాఖ ఏఈ కార్యాలయాలు ఉండగా, నియోజకవర్గానికి ఒకరు చొప్పున 12 మంది డీఈలు, 5 రెవెన్యూ డివిజన్‌లకు ఒకరు చొప్పున ఐదుగురు ఈఈలు, జిల్లా స్థాయిలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉండేవారు. వీరితో పాటుగా ప్రధాన పట్టణాల్లో పట్టణ ఏఈలు సైతం మిర్యాలగూడ, భువనగిరి, నల్గొండ, సూర్యాపేట దేవరకొండలో ఉండేవి. మండలానికి నలుగురు చొప్పున వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, కంప్యూటర్ సిబ్బంది విధులు నిర్వర్తించే వారు. వీరిలో తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన వారిని విధుల నుంచి తొలగించారు. తక్కువ వ్యయంతో రెండు పడకల ఇళ్ల నిర్మాణం జరిపిస్తామని గృహనిర్మాణ శాఖ అధికారులు మిర్యాలగూడ పట్టణంలోని 'ఇందిరమ్మ కాలనీ'లో సుమారు రూ.2.20 లక్షల వ్యయంతో రెండు పడకల ఇంటిని 'మోడల్ హౌజ్'గా నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉంది.ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల లేఅవుట్ల తరహాలో ప్రైవేటు వెంచర్లకు ధీటుగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు.హుజూర్‌నగర్‌లో రాష్ట్రంలోనే 'మోడల్ ప్రాజెక్టు' సుమారు రూ.130 కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల సముదాయాల నిర్మాణం ప్రారంభించి సుమారు రూ.65 కోట్లు వ్యయం చేసి నిర్మాణాలు జరిపారు. తెలంగాణ ఏర్పాటు తరువాత దీనికి నిధులు కేటాయించక పోగా నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ ఏర్పాటు చేసే సన్నాహాలు జరుగుతుండగా ఈ ప్రాజెక్టు సైతం తిరిగి ప్రారంభిస్తారని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# అలంకారప్రాయం.. కార్యాలయానికి తాళం..

## జిల్లాలో కానరాని తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు



కాగజ్‌నగర్:జిల్లాలో తూనికలు- కొలతల (లీగల్ మెట్రాలజీ) కార్యాలయం అలంకారప్రాయంగా మారింది. అధికారులతో పాటు సిబ్బంది సైతం అందుబాటులో ఉండటం లేదు. దీంతో తనిఖీలు మాట పక్కనపెడితే వినియోగదారులు ఫిర్యాదు చేద్దామని వచ్చినా కార్యాలయం తలుపులు నిత్యం మూసివేసి ఉండటంతో అసంతృప్తితో వెనుతిరుగుతున్నారు. వినియోగదారులకు నాణ్యమైన సరకులు అందుతున్నాయా? లేదా అని పర్యవేక్షించడం.. తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడం జిల్లా లీగల్ మెట్రాలజీ (తూనికలు-కొలతల) కార్యాలయం విధులు. ఎల్లప్పుడు ప్రజల్లో ఉండాల్సిన అధికారులు కనీసం కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో వ్యాపారుల మోసాలకు అడ్డూఅదుపు ఉండటం లేదు. తూనికలు కొలతల కార్యాలయం ఎప్పుడు తెరుస్తారో? ఎప్పుడు మూస్తారో ఎవరికీ తెలియదు. అటెండరు, వాచ్‌మెన్, కార్యాలయం ఉద్యోగితోపాటు, వరంగల్‌కు చెందిన తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇన్‌ఛార్జి అధికారి నెలలో రెండుసార్లు వచ్చి పోతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం వల్ల ఉద్యోగులు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీసం పని వేళల్లో సైతం కార్యాలయం తలుపులు తీయడం లేదు. జిల్లాలోని 15 మండలాలు, కాగజ్‌నగర్ పురపాలిక ఉంది. జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌తోపాటు, సింగరేణి ఏరియాలోని రెబ్బెన, గోలేటి ఏరియాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. హొటళ్లు, కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ పంపులు, వాహన షోరూంలకు కొదువలేదు. తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు నాసిరకం పరికరాలు, తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), రెబ్బెన తదితర ప్రాంతాల్లోని బంకుల్లో పెట్రోలుకు బదులు నీళ్లు పోశారంటూ గతంలో పలువురు వినియోగదారులు ఆందోళన చేపట్టారు. కొన్నిచోట్ల పెట్రోల్ తక్కువగా పోస్తూ మోసగిస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి. అయినా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కార్యాలయం పాత తహసీల్దార్ కార్యాలయం పై అంతస్తులో కొనసాగుతోంది. కేవలం బోర్డు ఏర్పాటు చేయగా, ఆ కార్యాలయం పని వేళలు.. అధికారుల చరవాణి నెంబర్లు, ఇతర వివరాలేవీ స.హ.చట్టం బోర్డు కార్యాలయంపై ఏర్పాటు చేయలేదు. దీంతో వినియోగదారులు ఫిర్యాదు నిమిత్తం వస్తే.. కార్యాలయం మూసి ఉండటం.. సంబంధిత అధికారుల చరవాణుల నెంబర్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కార్యాలయాన్ని తెరిచి, పనివేళలు, అధికారుల చరవాణి నెంబర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# మరమ్మతులతోనే చివరికి నీరు



సారంగాపూర్:చివరి తడులు చివరి గ్రామాల వరకు నీరు చేరకపోవడంతో చేతికందే సమయంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధాన కాలువలతోపాటు ఉప కాలువల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సారంగాపూర్ మండలంలోని 12ఎల్‌కు రెండు ప్రాంతాల్లో, 1ఆర్ మూడు ప్రాంతాల్లో, బీర్‌పూర్ మండలంలోని చర్లపల్లి, ఆర్‌వీ మెయిన్ కాలువలు పలు ప్రాంతాల్లో కూలిపోయాయి. అంతేకాకుండా కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోవడమే కాకుండా అనేక ప్రాంతాల్లో సిమెంట్ లైనింగ్‌తోపాటు కాలువలు కూలిపోయినప్పటికీ మరమ్మతు చేపట్టడంలేదు. అలాగే ప్రతి తూము వద్ద గతంలో షట్టర్లు ఉంటుండగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దాదాపు అన్ని తూములకు షట్టర్లు లేకుండా పోయాయి. దీనివల్ల యాసంగి పంట సాగు సమయంలో పైప్రాంతంలో నీరు వృథాగా పోతుండగా కింది ఆయకట్టు రైతులకు నీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి పంటలకు సాగునీటి విడుదల ప్రారంభం కాకపోవడంతో కాలువల్లోని పూడిక మట్టి, పిచ్చిమొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగిస్తే చివరి వరకు నీరు చేరుకునే అవకాశముంది. గతంలో ఏటా ఉపాధి కూలీల ద్వారా పూడికమట్టిని తొలగిస్తే కొంత రైతులకు ఉపశమనం కలగడమే కాకుండా కూలీలకు ఉపాధి లభించేది. వర్షాకాలంలో పలు ప్రాంతాల్లో కాలువలకు గండ్లు పడడంతో అలాగే ఉండిపోయాయి. వర్షాకాలం పంటకు రైతులకు నీరు ఎక్కువగా అవసరం లేకపోవడంతో ఇబ్బంది తలెత్తలేదు. యాసంగి పంట కాలం ప్రారంభమైనందున ముందస్తుగానే పనులు చేపట్టినట్లయితే చివరి గ్రామాలకు నీరందే అవకాశముంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన తూముకు షట్టరు బిగించినప్పుడే పూర్తి స్థాయిలో నీటినిలువ సామర్థ్యం వీలవుతుంది. గతంలో 0.25 టీఎంసీ నింపేందుకు ఉన్న డీ-53ప్రధాన కాలువ నుంచి 12ఎల్ ద్వారా 250 క్యూసెక్కుల నీటిని తీసుకెళ్లి నింపే అవకాశముంది. ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం పెరగడంతో గతంలో ఉన్న కాలువ ద్వారా నీటిని నింపడం ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తుండడంతో రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీటిని నింపడం అధికారులకు తలనొప్పిగా మారుతుంది. 12ఎల్ కాలువపై సారంగాపూర్ మండలం పరిధిలోని 1ఆర్ కాలువ ద్వారా రేచపల్లి, సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాల రైతులకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది. దీనివల్ల వారం రోజుల్లో రోళ్లవాగు ప్రాజెక్టు కనీస నీటినిలువ సామర్థ్యం చేరుకోవడంలేదు. అంతేకాకుండా ప్రాజెక్టు పై ప్రాంతంలో నిర్మించిన చర్లపల్లి బుగ్గ చెరువు తూము నుంచి నీరు వెళ్లేందుకు కనీస నిలువ సామర్థ్యం ఉన్నప్పుడే వీలవుతుంది. అయితే షట్టరు బిగించకపోవడంతో రైతులకు నీరు చేరుకోవడం ఇబ్బందిగా మారనుంది. అధికారులు చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది.

# ఆశజనకంగా కంది సాగు



కోదాడ:కంది పంట కూడా మరో నెలలో చేతికి రానుంది. ఈ ఏడాది కంది పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉంది. ఇప్పటి నుంచి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. కంది సాగుకు అనువుగా వర్షాలు ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. మిగతా పంటలతో పోల్చుకుంటే కంది సాగుకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. దీంతో రైతుకు ఈ పంట ద్వారా అధిక లాభం వచ్చే అవకాశం ఉంది. కంది వర్షాధార పంట కావడం, తెగుళ్లు ఎక్కువగా సోకకపోవడం, చేను ఎత్తుగా ఉండటంతో గడ్డి సమస్య ఉండకపోవడంతో రైతుకు అదనపు పెట్టుబడి బాధ తప్పుతుంది. పప్పు దినుసులకు మార్కెట్లో గిరాకీ ఉండటం, కందులకు గతంతో పోల్చుకుంటే క్వింటా ధర రూ.10 వేల వరకు పలుకుతోంది. ఎకరానికి సుమారు అయిదు క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాదితో పోల్చుకుంటే ఈసారి కంది సాగు తగ్గింది. వరివైపు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతుండటంతో ఈ పంట సాగు తగ్గింది. ఈ ఏడాది మూడెకరాల్లో కంది సాగు చేశాను.

# చిరు వ్యాపారం.. స్వయం ఉపాధికి మార్గం



సిరిసిల్ల :సిరిసిల్లలోని మహిళా సంఘాల సభ్యులు చిరు వ్యాపారాలు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు పొంది సకాలంలో వాటిని తిరిగి చెల్లిస్తున్నారు. వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతో తమ కాళ్లపై తాము నిలబడుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. కిరాణా, బ్యాంగిల్ స్టోర్, మ్యాచింగ్ సెంటర్లే కాకుండా పచ్చళ్ల వ్యాపారం చేస్తూ ఆదాయం పొందుతున్నారు. కుటుంబ పోషణలో భాగమవుతూనే ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.నేను మూడు సంవత్సరాల క్రితం రూ.లక్ష రుణం తీసుకున్నాను. దాంతో ఇంట్లో చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నా. మా ఇంటి వద్ద ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు నివసించేవారు. వారికి ఒకసారి ఇంట్లో చేసిన పచ్చడి విక్రయించాను. మంచి స్పందన రావడంతో దాన్నే వ్యాపారంగా మార్చుకున్నా. మామిడి, నిమ్మకాయ, టమాట, చింతకాయ, కాకరకాయ, కొత్తిమీర, చికెన్, ఉసిరికాయ పచ్చళ్లు పెట్టి విక్రయిస్తున్నాను. వ్యాపారం బాగా నడుస్తోంది. జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలు, దుబాయ్, అమెరికా వంటి దేశాలకు పంపిస్తున్నా. కుటుంబ పోషణలో భాగస్వాము రాలైనందుకు సంతోషంగా ఉంది. నేను గత పదేళ్లుగా పిండి వంటలు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నాను. మహిళా సంఘం ద్వారా మొదటిసారి రూ.10 వేల రుణం తీసుకున్నాను. సకాలంలో చెల్లించాను. నాలుగు నెలల కిందట రూ.50 వేల రుణం తీసుకున్నాను. లడ్డూలు, అరిసెలు, కారంపూస, సకినాలు, గారెలు వంటి పిండి వంటలు చేసి విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నాను. శుభకార్యాలతో పాటు ఆర్డర్లపై చేసి అందిస్తాను. మహిళలు ముందుకు వచ్చి స్వయం ఉపాధి పొంది కుటుంబ పోషణలో తమ పాత్ర పోషించాలి.

# టెస్టు క్రికెట్‌ను చంపే కుట్ర.. సఫారీ

## బోర్డుపై ఆసీస్ దిగ్గజం ఆగ్రహం

త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న దక్షిణాఫ్రికా జట్టు అనామక జట్టును ఎంపిక చేయడంపై ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ స్టీవ్ వా ఆగ్రహం వ్యక్తం చేశాడు. సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు (సీఎస్ఏ) కు టెస్టు క్రికెట్ అంటే పట్టింపులేదని, వాళ్లకు దేశం కంటే ఫ్రాంచైజీ క్రికెట్టే ఎక్కువని, అందుకే అన్‌క్యాప్డ్ ప్లేయర్లను ఎంపిక చేసిందని అన్నాడు.



ఇది న్యూజిలాండ్ క్రికెట్‌ను అవమానించడమేనని, తానే గనక న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు చైర్మెన్ అయి ఉంటే ఇప్పటికే ఈ సిరీస్‌ను క్యాన్సిల్ చేసి ఉండేవాడినని తెలిపాడు. స్టీవ్ వా మాట్లాడుతూ 'వాళు (సీఎస్ఎస్) టెస్టుల గురించి పట్టించుకోరు. దక్షిణాఫ్రికా చేసిన ఈ పనివల్ల భవిష్యత్‌లో తమ రెగ్యులర్ ప్లేయర్లను ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌లు ఆడించుకుంటూ దేశానికి ఆడేవారిని మాత్రం అనామక క్రికెటర్లను పంపించనుందని స్పష్టమవుతున్నది. ఒకవేళ నేనే గనక న్యూజిలాండ్ క్రికెట్ బోర్డులో ఉండి ఉంటే అసలు ఈ సిరీస్ ఆడకపోయేవాన్ని.. న్యూజిలాండ్ క్రికెట్‌ను ఇది అవమానించడమే..' అని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు.

ఒక్క దక్షిణాఫ్రికా మాత్రమే కాదని, పలు దేశాలు ఇదే రీతిన వ్యవహరిస్తున్నాయని స్టీవ్ వా అన్నాడు. గతేడాది తమ దేశ పర్యటనకు వచ్చిన వెస్టిండీస్ కూడా పూర్తిస్థాయి జట్టును పంపలేదని స్టీవ్ వా అన్నాడు. వెస్టిండీస్ చాలాకాలంగా పూర్తిస్థాయి జట్టుతో ఆడటం లేదని, ఇది టెస్టు క్రికెట్‌కు ప్రమాదకరమని స్టీవ్ వా ఆందోళన వ్యక్తం చేశాడు. కాగా కివీస్ పర్యటనకు గాను దక్షిణాఫ్రికా ఇటీవలే ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో కెప్టెన్‌తో పాటు ఏడుగురు క్రికెటర్లు అన్‌క్యాప్డ్ ప్లేయర్లే కావడం గమనార్హం.

# కోహ్లీ ఉండగా 'వీక్ ప్లేయర్'కు కెప్టెన్సీ ఎందుకు..?

టీమిండియా సారథి రోహిత్ శర్మపై మాజీ క్రికెటర్ ఎస్. బద్రీనాథ్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. రోహిత్‌ను 'వీక్ ప్లేయర్' అని, స్వదేశంలో తప్ప విదేశాల్లో అతడు ఓపెనర్‌గా చేసిందేమీ లేదని సంచలన ఆరోపణలు చేశాడు.



టెస్టులలో రోహిత్‌ను తప్పించి కోహ్లీకే పగ్గాలు అప్పజెప్పాలని, సేన (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై కోహ్లీకి బ్యాటర్‌గానే గాక కెప్టెన్‌గా కూడా మెరుగైన రికార్డు ఉన్నదని బద్రీనాథ్ అన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా ఇటీవలే సెంచూరియన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ ఘోర ఓటమిని మూటగట్టుకున్న నేపథ్యంలో బద్రీనాథ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'సేన దేశాలపై కోహ్లీకి ఘనమైన రికార్డు ఉంది. కెప్టెన్‌గా అతడు ఐదు వేలకు పైగా పరుగులు సాధించాడు. ఈ క్రమంలో అతడి సగటు 52కు పైగా ఉంది. 68 టెస్టులకు సారథిగా వ్యవహరించిన కోహ్లీ.. 40 మ్యాచ్‌లలో గెలిచి 17 మ్యాచ్‌లలో ఓడాడు. ఆస్ట్రేలియాలో అతడి సారథ్యంలోనే భారత్ అద్భుత విజయాలు సాధించింది. గ్రేమ్ స్మిత్, రికీ పాంటింగ్, స్టీవ్ వా తర్వాత టెస్టులలో అత్యధిక టెస్టు విజయాలు కలిగిన సారథి కోహ్లీ మాత్రమే.. ఇన్ని రికార్డులు ఉన్న కోహ్లీ టెస్టులలో భారత జట్టును ఎందుకు నడిపించడం లేదు..? కోహ్లీ టెస్టులలో మెరుగైన బ్యాటర్. కోహ్లీ, రోహిత్ మధ్య పోలిక లేదు. టెస్టులలో మాత్రం కోహ్లీ బిగ్ ప్లేయర్. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా కోహ్లీ పరుగులు చేశాడు. కానీ మన టీమ్‌ను వీకర్ ప్లేయర్ ఎందుకు నడిపించాలి..? అతడు (రోహిత్‌ను ఉద్దేశిస్తూ) టెస్టులలో ఇంకా ఓపెనర్‌గా తనను తాను ప్రూవ్ చేసుకోలేదు. జట్టులోకి వస్తూ పోతూ ఉంటాడు. మనం దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. స్వదేశంలో తప్పితే విదేశాల్లో రోహిత్ ఓపెనర్‌గా తనదైన ముద్ర వేయలేదు. అయినా అతడు ఇంకా అక్కడ (కెప్టెన్‌గా) ఎందుకున్నాడు..?' అని బద్రీనాథ్ వ్యాఖ్యానించాడు.

# శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్..

## జింబాబ్వే సారథిగా ఎర్విన్

కొత్త ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు వన్డే, టీ20 సిరీస్‌కు సిద్ధమవుతోంది. జనవరిలో శ్రీలంక పర్యటన ఉన్నందున ఆ దేశ క్రికెట్ బోర్డు సోమవారం 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. ఈ సిరీస్ కోసం విధ్వంసక బ్యాటర్ క్రెగ్ ఎర్విన్‌కు మళ్లీ సారథ్య బాధ్యతలు అప్పగించింది. టీ20లకు సికిందర్ రజా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇక 33 ఏండ్ల ఆఫ్ స్పిన్నర్ మపుధ్జ తపివ, పేసర్ ఫరజ్ అక్రమ్ కూడా అనూహ్యంగా స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. ఐర్లాండ్ సిరీస్‌లో అదరగొట్టిన కైతనో, తినశే, మిల్టన్, టోనీలు ఊహించినట్టుగానే లంక సిరీస్‌కు సెలెక్ట్ అయ్యారు. వన్డే స్క్వాడ్ : క్రెగ్ ఎర్విన్(కెప్టెన్), అక్రమ్ ఫరాజ్, బర్ల్ రియాన్, గుంబీ జాయ్‌లార్డ్, జాంగ్వే లుకే, కైతనో తకుడ్జువనషే, కమన్హుకమ్వే, మదండె క్లైవ్, మసకజ్జ వెల్లింగ్‌టన్, మపుధ్జ తపివ, మున్యోంగ టోని, ముజరబని బ్లెస్సింగ్, గరావ రిచర్డ్, సికిందర్ రజా, శుంబా మిల్టన్. టీ20 స్క్వాడ్ : సికిందర్ రజా(కెప్టెన్), బ్రియాన్ బెన్నెటె, రియాన్ బర్ల్, క్రెగ్ ఎర్విన్, జాయ్‌లార్డ్ గుంబీ, ల్యూకే జాంగ్వే, తనిషే, క్లైవ్ మదండే, వెల్లింగటన్ మసకజ్జ, కార్ల్ ముంబా, టోని మున్యోంగ, బ్లెస్సింగ్ ముజరబని,



ఐన్‌స్లే డ్లోవు, రిచర్డ్ గరవ, మిల్టన్ శుంబ. జింబాబ్వే జట్టు త్వరలోనే శ్రీలంక గడ్డపై మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఇరుజట్ల మధ్య మొదటి మ్యాచ్ జనవరి 6న మొదలవ్వనుండగా.. జనవరి 14 నుంచి మూడు మ్యాచ్‌ల టీ20ల సిరీస్ షురూ కానుంది. వరల్డ్ కప్‌లో ఘోర వైఫల్యంతో మేల్కొన్న శ్రీలంక బోర్డు స్టార్ బ్యాటర్ కుశాల్ మెండిస్‌కు వన్డే కెప్టెన్సీ, ఇక మిస్టరీ స్పిన్నర్ వనిందు హసరంగ టీ20 కెప్టెన్సీ అప్పగించిన విషయం తెలిసిందే.

# కొత్త స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు.. పంజాబ్ కింగ్స్‌కు కలిసొచ్చేనా..?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ మినీ వేలం ముగియడంతో అన్ని ఫ్రాంచైజీలు టోర్నీ సన్నద్ధతపై దృష్టి పెట్టాయి. ఐపీఎల్ టాప్ జట్లలో ఒకటైన పంజాబ్ కింగ్స్ 2024 ఎడిషన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది.




ఈసారి ఆ జట్టు మొహాలీతో పాటు మరో కొత్త స్టేడియంలో ఆడనుంది. ముల్లన్‌పూర్ లో కొత్తగా నిర్మిస్తున్న స్టేడియం దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ మధ్యే పంజాబ్ క్రికెట్ ఆసోసిషేన్ అధికారులు ఈ స్టేడియాన్ని సందర్శించి, ఫొటోలు షేర్ చేశారు. 'పంబాజ్ క్రికెట్ అభిమానుల నిరీక్షణకు తెరపడింది. ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మిస్తున్న స్టేడియం పనులు పూర్తి కావొచ్చాయి. ఐపీఎల్ 2024 సీజన్ ప్రారంభ సమయానికల్లా ఈ స్టేడియం సిద్ధమవుతుంది' అని పీసీఏ సెక్రటరీ దిల్షేర్ ఖన్నా ఓ ప్రకటనలో తెలిపాడు.

వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న భారత్, అఫ్గనిస్థాన్ టీ20 మ్యాచ్‌కు ముల్లనూర్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుందనే వార్తలు వినిపించాయి. అయితే.. ఈ సమయానికి స్టేడియం పనులు పూర్తి కావని, ఐపీఎల్ 17వ సీజన్ వరకు సిద్ధమవుతుందని పీఏసీ అధికారులు తెలపారు. ముల్లనూర్ స్టేడియంలో 12 పిచ్‌లు ఏర్పాటు చేశారు. ఆటగాళ్ల కోసం రెండు పెద్ద డ్రెస్సింగ్ రూమ్‌లు నిర్మించారు. మొత్తంగా ఇందులో 30 వేల మంది మ్యాచ్ వీక్షించొచ్చు. దాదాపు 1,800 కార్లు పార్కింగ్ చేసే వీలుంది.

కింగ్స్ సత్తా చాటుతుందా?

ఐపీఎల్ తొలినాళ్లలో గట్టి పోటీనిచ్చిన పంజాబ్ కింగ్స్ ఆతర్వాత తేలిపోయింది. యువరాజ్ సింగ్, కుమార సంగక్కర, వీరేంద్ర సెహ్వాగ్‌లు కెప్టెన్‌గా, జట్టు నిండా మ్యాచ్ విన్నర్లు ఉన్నా కూడా ఆ జట్టు టైటిల్ గెలవలేకపోయింది. 16వ సీజన్‌లో శిఖర్ ధావన్ నేతృత్వంలో పంజాబ్ విజయంతో ఆరంభించినా అనంతరం పేలవ ఆటతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. మినీ వేలంలో రూ.18.50 కోట్లు పలికిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ తీరా టోర్నీలో నిరాశపరిచాడు. ఒక్కటంటే ఒక్క మ్యాచ్‌లోనూ జట్టును గెలిపించలేకపోయాడు.

ఇక 17వ సీజన్ వేలంలో ప్రీతి జింతా బ్యాచ్ పేసర్ హర్షల్ పటేల్‌ను రూ.11.75 కోట్లకు, ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్‌ను రూ. 4.20 కోట్లకు కొన్నది. పంజాబ్ ఈసారి మొహాలీతో పాటు మున్ననూర్ స్టేడియాల్లో ఆడనుంది. బ్యాటింగ్, బౌలింగ్ యూనిట్ పరంగా బలంగా కనిపిస్తున్న ఆ జట్టు ఏ మేరకు రాణిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది.

# ఆరెంజ్ క్యాప్ గెలవాలి.. అత్యధిక సెంచరీలు చేయాలి

కొత్త ఏడాది వచ్చిందంటే అందరూ 'న్యూఈయర్ రెజల్యూషన్స్' నిర్దేశించుకోవడం కొత్తేమీ కాదు. అయితే వీటిని కొనసాగిస్తూ లక్ష్యం దిశగా నడిచేవాళ్లు చాలా తక్కువమంది ఉంటారు.



ఆరంభ శూరత్వంతో వాటిని నాలుగైదు రోజులు పాటించి తర్వాత మూలన పడేసేవారే ఎక్కువ. చిత్తశుద్ధితో ఏడాదిపాటు శ్రమించి ఫలితాలు సాధించేవాళ్లు చాలా తక్కువ ఉంటారు. కానీ టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ మాత్రం ఆ దిశగా సక్సెస్ అయ్యాడు. ఈ ఏడాది (2023లో) అతడు పెట్టుకున్న టార్గెట్స్‌లో చాలావరకూ అచీవ్ చేశాడు. భారత్ తరఫున అత్యధిక సెంచరీలు చేయాలి.. ఐపీఎల్‌లో ఆరెంజ్ క్యాప్ నెగ్గాలి వరల్డ్ కప్ గెలవాలి.. అంటూ రెజల్యూషన్స్ పెట్టుకున్న నాటి ఫోటోను షేర్ చేశాడు.

ఈ మేరకు గిల్ తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో ఒక పేపర్ మీద తన చేతిరాతతో రాసుకున్న 2023 రెజల్యూషన్స్ ను షేర్ చేశాడు. అందులో 'మోస్ట్ హండ్రెడ్ ఫర్ ఇండియా.. నా కుటుంబాన్ని సంతోషంగా ఉంచాలి.. వరల్డ్ కప్.. ఆరెంజ్ క్యాప్..'అని రాసుకున్నాడు. గిల్ రెజల్యూషన్స్ పెట్టుకున్న వాటిలో చాలా మట్టుకు సాధించాడు. 2023 ఐపీఎల్‌లో ఆరెంజ్ క్యాప్ గెలిచింది ఈ యువ ఓపెనరే కావడం విశేషం.

అంతేగాక భారత్ తరఫున అత్యధిక సెంచరీలు చేసిన వారి జాబితాలో కూడా గిల్ ముందువరుసలోనే ఉన్నాడు. వన్డేలలో గిల్ ఐదు శతకాలు సాధించాడు. ఇందులో ఓ డబుల్ సెంచరీ (కివీస్‌పై) కూడా ఉంది. వన్డేలలో అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో కోహ్లీ (6) ముందున్నాడు. గిల్.. వన్డేలతో పాటు టీ20లలో ఒకటి, టెస్టులలోనూ ఓ సెంచరీ చేశాడు. మూడు ఫార్మాట్లలో కలిపి ఈ ఏడాది గిల్ ఏడు సెంచరీలు చేయగా కోహ్లీ 8 సెంచరీలు సాధించాడు. మొత్తంగా ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన భారత క్రికెటర్ల జాబితాలో మాత్రం గిల్ ముందున్నాడు. ఈ ఏడాది గిల్.. 2,154 పరుగులు చేశాడు.

# వన్డేలకూ వార్నర్ గుడ్ బై.. షాక్‌లో అభిమానులు

కొత్త ఏడాది మొదటి రోజే ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ అభిమానులకు షాకింగ్ న్యూస్ చెప్పాడు. స్వదేశంలో పాకిస్థాన్‌తో చివరి టెస్టుతో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకనున్న డేవిడ్ భాయ్ వన్డేలకు కూడా గుడ్ బై చెప్పేశాడు.



అయితే.. 2025లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ కి అందుబాటులో ఉంటానని తెలిపాడు. 'నేను టెస్టులతో పాటు వన్డేల నుంచి కూడా వైదొలుగుతున్నా. ఈ విషయాన్ని నేను వన్డే ప్రపంచ కప్ నుంచి చెప్తున్నా. రిటైర్మెంట్‌పై ఈ రోజు నిర్ణయం తీసుకున్నా. భారత గడ్డపై వరల్డ్ కప్ గెలవడం నా కెరీర్‌లో అతిముఖ్యమైన సందర్భం. ఒకవేళ నా శరీరం సహకరిస్తే వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో ఆడుతా' అని రెండుసార్లు వరల్డ్ కప్ విజేత అయిన వార్నర్ వెల్లడించాడు. అంతేకాదు

ఇకపై అంతర్జాతీయ టీ20 లీగ్స్‌పై దృష్టి పెట్టనున్నట్టు ఈ స్టార్ ఓపెనర్ స్పష్టం చేశాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ ఇప్పటివరకూ 161 వన్డేల్లో 6,932 పరుగులు సాధించాడు. అంతేకాదు 97.26 స్ట్రైక్ రేటుతో 22 సెంచరీలు బాదిన డేవిడ్ భాయ్.. ఆసీస్ తరఫున అత్యధిక శతకాలు బాదిన రెండో క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 29 సెంచరీలు అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఓపెనర్‌గా ఆస్ట్రేలియా క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన వార్నర్ 111 టెస్టుల్లో 8,695 పరుగులు సాధించాడు. రికార్డు స్థాయిఓల 26 సెంచరీలు బాదాడు. అంతేకాదు రికీ పాంటింగ్ తర్వాత ఆసీస్ తరఫున అత్యధిక రన్స్ కొట్టిన క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. వార్నర్ వెస్టిండీస్ పర్యటనకు దూరం కానున్నాడు. అయితే.. యూఏఈలో వచ్చే ఏడాది జరిగే ఇంటర్నేషనల్ టీ20 లీగ్‌లో ఈ డేంజరస్ ఓపెనర్ మెరుపులు మెరిపించనున్నాడు.

# టెన్నిస్ కోర్టులో ఫుట్‌బాల్.. ఫ్యాన్స్‌ను

## అలరించిన స్పెయిన్ బుల్

మాజీ వరల్డ్ నంబర్ వన్ రఫెల్ నాదల్ 12 నెలల తర్వాత బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీతో పునరాగమనం చేశాడు. ఆస్ట్రేలియాలో ఆదివారం జరిగిన డబుల్స్ మ్యాచ్ ఆసాంతం చురుకుగా కదులుతూ మునపటి నాదల్‌ను గుర్తు చేశాడు.




37 ఏండ్ల ఈ స్పెయిన్ బుల్ ఈ మ్యాచ్‌లో తన ఫుట్‌బాల్ స్కిల్స్‌తో ఫ్యాన్స్‌ను అలరించాడు. మార్క్ లోపెజ్‌తో జోడీ కట్టిన నాదల్ మ్యాచ్ మధ్యలో ఫుట్‌బాల్ ఆడి బాల్ గర్ల్‌కు బంతిని ఇచ్చాడు. దాంతో, అక్కడి అభిమానులు చప్పట్లు కొడుతూ రఫాను అభినందించారు. అయితే.. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన జోర్డన్ థాంప్సన్, మాక్స్ పొర్సెల్ జోడీ 4-6, 4-6తో రఫా ద్వయాన్ని ఓడించింది. నాదల్ తర్వాత పురుషుల సింగిల్స్ యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ డోమ్నిక్ థీమ్ ను ఢీకొట్టనున్నాడు.

2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాదల్ రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. ఆ తర్వాత తొడకండరాల గాయం కారణంగా ఏడాది పాటు ఆటకు దూరమైన ఈ స్టార్ ప్లేయర్ బ్రిస్బేన్ ఇంటర్నేషనల్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించాడు. నాదల్, థీమ్ ఇప్పటివరకూ 15 సార్లు తలపడ్డారు. అయితే.. రికార్డు స్థాయిలో స్పెయిన్ బుల్ 9 సార్లు గెలుపొందగా.. థీమ్ రెండు సార్లు పై చేయి సాధించాడంతే. అది కూడా కీలకమైన ఏటీపీ ఫైనల్స్, 2022 ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో థీమ్.. రఫాను చిత్తు చేశాడు. దాంతో, ఈసారి ఎవరు గెలుస్తారు? అనేది ఆసక్తికరంగా మారింది.

# కేప్‌టౌన్ చేరుకున్న టీమిండియా..

దక్షిణాఫ్రికా పర్యటనలో తొలి టెస్టులో కంగుతిన్న భారత జట్టు ఇప్పుడు సిరీస్ సమం చేయడంపై దృష్టి పెట్టింది.




సిరీస్‌లో కీలకమైన రెండో టెస్టులో సమిష్టి ప్రదర్శనతో రాణించాలని రోహిత్ శర్మ బృందం పట్టుదలతో ఉంది.

కొత్త ఏడాదిలో జనవరి 3న జరిగే ఈ టెస్టు కోసం టీమిండియా ఆటగాళ్లు కేప్‌టౌన్ బయలుదేరారు. కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ, జట్టు సభ్యులు విమానాశ్రయంలో ఉన్న వీడియోను బీసీసీఐ విడుదల చేసింది. సెంచూరియన్ పిచ్‌తో పోల్చితే కేప్‌టౌన్ పరిస్థితులు పేస్ బౌలర్లకు మరింత సహకరించనుంది. దాంతో, రబాడ నేతృత్వంలోని సఫారీ పేస్ దళాన్ని రోహిత్ సేన ఏమేరకు ఎదుర్కొంటుంది? అనేది ఆసక్తికరంగా మారింది.

సెంచూరియన్‌లో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా భారీ విజయం సాధించింది. బౌలింగ్‌కు సహకరించిన పిచ్‌పై పేసర్లు రబడ, బర్గర్ చెలరేగడంతో ఇన్నింగ్స్ 32 పరుగులతో గెలుపొందింది. 163 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన రోహిత్ సేన 133 పరుగులకే కుప్పకూలింది. విరాట్ కోహ్లీ(76) ఒంటరి పోరాటం చేసినా ఇన్నింగ్స్ ఓటమి తప్పించలేకపోయాడు. జాన్‌సెన్ ఓవర్లో భారీ షాట్ ఆడిన కోహ్లీ.. బౌండరీ వద్ద రబాడ చేతికి చిక్కాడు. దాంతో ప్రొటిస్ జట్టు రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అరంగేట్రంలోనే బర్గర్ 7 వికెట్లతో మెరవగా.. రబడ కూడా ఏడు వికెట్లతో సత్తా చాటాడు.

# టెస్టులలో గిల్ వైఫల్యానికి కారణమదే : గవాస్కర్

టీమిండియా యువ సంచలనం శుభ్‌మన్ గిల్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత జట్టు భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతున్నా టెస్టులలో మాత్రం ఇప్పటికీ అతడు తన మార్క్‌ను చూపెట్టేలేకపోయాడు. ఈ ఏడాది వన్డేలతో పాటు ఐపీఎల్‌లో దుమ్మురేపే ప్రదర్శనలతో అదరగొట్టిన గిల్.. టెస్టులలో మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. విరాట్ కోహ్లీ వారసుడిగా గుర్తింపు పొందుతున్న గిల్ టెస్టులలో విఫలమవడానికి కారణం దూకుడుగా ఆడటమే అని గవాస్కర్ అన్నాడు.



దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భాగంగా సెంచూరియన్ టెస్టులో గిల్ మరోసారి విఫలమైన నేపథ్యంలో సన్నీ మాట్లాడుతూ 'టెస్టులలో గిల్ చాలా దూకుడుగా ఆడుతున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌తో పోల్చితే టెస్టు క్రికెట్ చాలా భిన్నంగా ఉంటుంది. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం బాల్. వైట్ బాల్‌తో పోల్చితే రెడ్ బాల్ వేగంగా మూవ్ అవుతుంది. బాల్ ఎక్కువ బౌన్స్ అవుతుంది. అతడు దీనిని మనసులో పెట్టుకోవాలి' అని అన్నాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**